

10న సీఎం రాక

- రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం
- యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష
- 9న మంత్రి నారా లోకేశ్ రాక





విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల పదో తేదీన నగరానికి రానున్నారు. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన నూతన భవనంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తోపాటు మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించనున్నారు. ఇంకా అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై ఆయన

... మిగతా 6వ పేజీలో

భక్తి శ్రద్ధలతో బక్రీద్

నగరంలోని ముస్లిం సోదరులు శనివారం బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోటవీధి, చెంగలరావుపేట, జగదాంబ జంక్షన్, చినవాల్తేర్, అక్కయ్యపాలెం, అల్లిపురం, ముస్లిం తాటిచెట్లపాలెం, న్యూకాలనీ, మర్రిపాలెం, గోపాలపట్నం, గాజువాక, పెందుర్తి, ఎంవీపీ కాలనీ, మధురవాడ ప్రాంతాల్లోని మసీదుల్లో ఈదుల్ అజ్‌హా వేడుకలు నిర్వహించారు. సామూహిక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు బక్రీద్ సందేశాన్ని తెలియజేశారు. నమాజ్ ముగిసిన తరువాత ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి



కోటవీధి వద్ద మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు




పల్లా సింహాచలం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఉన్నారు.

ఒరిగిన శిఖరం

మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం అస్తమయం

షిప్‌యార్డులో కార్మికుడిగా ఉద్యోగ జీవితం ప్రారంభం

- కార్మిక నాయకుడిగా సుదీర్ఘ కాలం సేవలు
- అనంతరం రాజకీయాల్లోకి రాక



పల్లా సింహాచలం(ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసనసభ్యుడు పల్లా సింహాచలం (86) శనివారం కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని సీతంపేటలో గల తన స్వగృహంలో కన్నుమూశారు. గాజువాక ప్రాంతానికి చెందిన ఆయన రాజకీయాల్లో వివాదరహితునిగా పేరు సంపాదించుకున్నారు. అన్ని వర్గాలు, పార్టీల నాయకులతో సత్సంబంధాలు కొనసాగించారు. సింహాచలం హిందూస్థాన్ షిప్‌యార్డులో కార్మికునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తోటి కార్మికులకు, ఉద్యోగులకు సమస్యలు వచ్చినప్పుడు అండగా నిలిచేవారు. నాడు షిప్‌యార్డులో 365 కార్మికుల సర్వీస్

... మిగతా 6వ పేజీలో



పల్లా శ్రీనివాసరావును ఫోన్‌లో పరామర్శిస్తున్న సీఎం చంద్రబాబు

రైల్వే స్టేషన్ అభివృద్ధికి తొలగిన అడ్డంకులు

కాంట్రాక్టర్ కోర్టు కేసు పరిష్కారం

- కొత్త సంస్థకు బాధ్యతలు
- అక్టోబరులో పనుల ప్రారంభం
- 2027 మే నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- పూర్తిగా మారిన డీపీఆర్
- ప్లాట్‌ఫారాలు 14కి పెంపు

రైల్వే స్టేషన్ నమూనా



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వేస్టేషన్ పునర్నిర్మాణం పనులకు అడ్డంకులు తొలగిపోయాయి. కాంట్రాక్టర్ కోర్టు వివాదం పరిష్కారమైంది. కొత్త కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. అక్టోబరు నుంచి పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. అక్కడి నుంచి 18 నెలల్లో అంటే 2027 మే నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను పూర్తిగా అభివృద్ధి చేయాలని రైల్వే మంత్రిత్వ శాఖ 2022లో నిర్ణయించింది. రైల్వే ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌ఎల్‌డీఏ) ఈ బాధ్యత తీసుకుంది. అదే ఏడాది జూన్‌లో బిడ్డర్లతో సమావేశం నిర్వహించి ఏ తరహాలో అభివృద్ధి చేయాలనుకుంటున్నదీ వివరించింది. ఆగస్టులో రూ.456 కోట్లతో బిడ్డింగ్ ఖరారు చేసింది. నవంబరు రెండో తేదీన ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించారు. 36 నెలల్లో పూర్తిచేయాలనేది ఒప్పందం. అంటే అన్నీ సవ్యంగా జరిగితే ఈ ఏడాది నవంబరుకు ఈ ప్రాజెక్టు పూర్తి కావలసి ఉంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కనస్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో ఈ కాంట్రాక్టును ఇచ్చారు. అయితే కాంట్రాక్టర్‌కు, ఆర్‌ఎల్‌డీఏకు మధ్య విభేదాలు వచ్చాయి. దాంతో వారు కోర్టును ఆశ్రయించారు. పనులు ఆగిపోయాయి.

కొత్త డీపీఆర్ తయారీ

ముంబై నుంచి బదిలీపై వచ్చి ఇక్కడ డీఆర్‌ఎంగా పనిచేస్తూ రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి దొరికిపోయిన సౌరభ్ ప్రసాద్ ఈ కోర్టు కేసు పరిష్కారానికి కృషిచేశారు. ఆ ఫలితంగా అది కొలిక్కి వచ్చి కొత్త కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. అయితే అప్పుడు అనుకున్న ప్రకారం కాకుండా ఇంకా అనేక అదనపు పనులు జోడించి కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక

... మిగతా 6వ పేజీలో

ఉన్నవి వదిలేసి, బయట కొనుగోలు చేసి...!

ఇదీ కేజీహెచ్ ఉన్నతాధికారుల నిర్వాకం

- ఆస్పత్రిలో ఆరు ఆక్సిజన్ ప్లాంట్లు
- కొవిడ్ సమయంలో రూ.5.22 కోట్లతో ఏర్పాటు
- వాటిని వినియోగించుకోకుండా, బయట కొనుగోలు చేస్తున్న వైనం
- నెలకు రూ.30 లక్షల వరకూ వ్యయం
- సమర్థించుకునేందుకు అంతా క్వాలిటీ ఉండదంటూ అడ్డగోలు వాదన



కేజీహెచ్‌లోని ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్



విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): **కేజీహెచ్‌లో ఆరు ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నాయి. అయితే అధికారులు వాటిని ఉపయోగించుకోకుండా, బయట ప్రైవేటు సంస్థల నుంచి ఆక్సిజన్ కొనుగోలు చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**

కరోనా తొలి, మలి దశల్లో ఆక్సిజన్ అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆస్పత్రుల్లో గాలి ద్వారా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటుచేశాయి. ఈ క్రమంలోనే కేజీహెచ్‌లో కూడా ఆరు ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. ఒక్కొక్క దానికి రూ.87 లక్షల చొప్పున ఆరింటికి రూ.5.22 కోట్లు వెచ్చించారు. ఒక్కో యూనిట్‌లో నిమిషానికి వేయి లీటర్ల ఆక్సిజన్ తయారుచేసే సామర్థ్యం కలిగిన యంత్రాలను ఏర్పాటుచేశారు. అయితే వైరస్ తగ్గుముఖం పట్టిన తరువాత వాటిని ఆస్పత్రి అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు.

కింగ్ జార్జ్ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లకు రెగ్యులర్‌గా ఆక్సిజన్ అవసరమవుతుంది. అందుకోసం ప్రైవేటు సంస్థ నుంచి ఆక్సిజన్ కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు ప్రతినెలా ఆస్పత్రి అధికారులు రూ.30 లక్షలకుపైగానే వెచ్చిస్తున్నారు. ఆస్పత్రిలో 20 కిలోలీటర్లు, 13 కిలోలీటర్లు సామర్థ్యం కలిగిన రెండు ట్యాంకర్లు ఉన్నాయి. ప్రైవేటు సంస్థ నుంచి కొనుగోలు చేసిన ఆక్సిజన్‌ను ఆ ట్యాంకుల్లో స్టోర్ చేసి వార్డులకు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సెంట్రలైజ్డ్ ఆక్సిజన్ సరఫరా సిస్టమ్‌ను ఏర్పాటుచేశారు. అయితే ఆస్పత్రిలో గల ప్లాంట్ల ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తే రోగుల అవసరాలు తీరేందుకు అవకాశం ఉంది. అయితే,

... మిగతా 6వ పేజీలో

స్పెషల్ బ్రాంచిలో చక్రం తిప్పుతున్న సీఐ

- సదరు అధికారిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా సీపీ వరకూ చేరనివ్వని పైఅధికారులు
- తాత్కాలిక వీసా జారీ విషయంలో ఇటీవల ఆరోపణలు
- అయినా కానరాని చర్యలు

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో అత్యంత కీలకంగా భావించే స్పెషల్‌బ్రాంచి విభాగంలో ఏం జరుగుతోందనే దానిపై అధికారులతోపాటు సిబ్బందిలో తీవ్ర చర్చ జరుగుతోంది. నగరంలో జరిగే అన్నిరకాల కార్యక్రమాలు, అధికారులు, ప్రజా ప్రతినిధుల పనితీరు, వారిపై వచ్చే ఆరోపణలతో పాటు పోలీస్ శాఖలో అధికారులు, సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి సీపీకి అందజేయాల్సిన బాధ్యత స్పెషల్‌బ్రాంచిపై ఉంటుంది. అంతటి కీలకమైన స్పెషల్ బ్రాంచిలో పనిచేయడాన్ని అధికారులు, సిబ్బంది కొన్నాళ్ల కిందటి వరకు ప్రతిష్ఠాత్మకంగా భావించేవారు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా స్పెషల్‌బ్రాంచి ప్రతిష్ఠ మసకబారుతోందనే అభిప్రాయం పోలీస్ శాఖలోనే వ్యక్తమవుతోంది. అవినీతిపై నిఘా పెట్టాల్సిన స్పెషల్‌బ్రాంచే ఆరోపణలకు నిలయంగా మారుతోంది. ప్రధానంగా స్పెషల్ బ్రాంచి విభాగంలో పనిచేస్తున్న ఒక కిందిస్థాయి అధికారి ఆ విభాగం ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని, తన గుప్పిట్లో పెట్టుకున్నారంటున్నారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్ చేసే కానిస్టేబుళ్లకు సైతం ఏదో ఒక పేరుతో ఆయన నిత్యం ఇండెంట్‌లు

... మిగతా 6వ పేజీలో

ఏయూలో అక్రమాలపై విచారణ



- మాజీ వీసీ ప్రసాదరెడ్డి హయాంలో తీసుకున్న నిర్ణయాలపై విజిలెన్స్ విచారణ చేపట్టనున్నట్టు ఇప్పటికే మంత్రి ప్రకటన
- కొనసాగుతున్న ఎంక్వయిరీ?
- మరో మూడు నెలలు పట్టే అవకాశం



మాజీ వీసీ ప్రసాదరెడ్డి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అర్హత లేనివారికి కీలక పదవులు ఇచ్చిన తీరుపై విచారణ జరుగుతోంది. అందరి లెక్కలు తేల్చే పని చాపకింద నీరులా సాగుతోంది. ఇది కొలిక్కి రావడానికి ఇంకో మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు పాతరేసి నచ్చినట్టుగా వ్యవహరించిన వారందరిపైనా ఇప్పుడు కేసులు నమోదవుతున్నాయి. కీలకమైన వ్యక్తులు కటకటాల వెనక్కి వెళుతున్నారు. కక్ష సాధింపులో భాగంగా ఇవన్నీ చేస్తోందనే అపవాదు రాకుండా ప్రభుత్వం విచారణ విభాగాల ద్వారానే తప్పులను వెలికితీసి, వాటికి కారకులు ఎవరో గుర్తించి, చట్టపరంగా కేసులు పెట్టి కారాగారానికి పంపుతోంది. విశాఖపట్నం జిల్లా విషయానికి వస్తే...ఇక్కడ అన్నీ తానై వ్యవహరించిన నాటి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి భీమిలి బీచ్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై కోర్టు ఆదేశాల ప్రకారం ఇప్పటికే చర్యలు చేపట్టారు. పునాదులు తొలగించారు.

ఇక ఆంధ్ర విశ్వవిద్యాలయం నాటి వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి వైసీపీ నాయకుడిలా పనిచేశారు. సరస్వతీ నిలయాన్ని వైసీపీ పార్టీ కార్యాలయంగా మార్చేశారు. జీవీఎంసీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక, నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో కీలకపాత్ర పోషించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. వార్డుల్లో వైసీపీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఇంకా రూ.20 కోట్ల రూసా నిధులు వినియోగం, ఇస్రో నుంచి వచ్చిన రూ.25 లక్షల ఖర్చులో నిబంధనలు ఉల్లంఘించారనే విమర్శలు వచ్చాయి. అలాగే ఏయూ ప్రొఫెసర్లను పక్కనపెట్టి బయట వారిని తీసుకువచ్చి కీలక బాధ్యతలు అప్పగించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు భారీ వేతనాలతో ఉద్యోగాల కల్పన, రిటైర్డ్ ప్రొఫెసర్లకు అడ్డగోలుగా పదవులు, అర్హత లేని వారికి ఉన్నత పదవులు ఇవ్వడం, టీడీఆర్ హబ్ ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాల్లో అక్రమాలు, టెండర్లు లేకుండానే క్యాంపస్‌లో ఎక్కడికక్కడ క్యాంటీన్లు పెట్టుకునేందుకు అనుమతులు...ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంతా

... మిగతా 6వ పేజీలో

సప్లిమెంటరీలోనూ వెనుకంజ

- ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 46 శాతం ఉత్తీర్ణత
- ద్వితీయ సంవత్సరంలో 63 శాతం
- ప్రభుత్వ కళాశాలల ఉత్తీర్ణత మరీ దారుణం

మద్దిలపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు వెనకబడ్డారు. వార్షిక ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రైవేటు కళాశాలలు సైతం సప్లిమెంటరీలో చతికిలబడ్డాయి. ఫెయిలవ్వడంలో ప్రభుత్వ కళాశాలలతో పోటీపడ్డాయి. ఫలితంగా రాష్ట్ర స్థాయిలో జిల్లా స్థానం

... మిగతా 6వ పేజీలో

సింహగిరి కిటకిట

- అప్పన్న స్వామిని దర్శించేందుకు తరలివచ్చిన భక్తజనం
- ఒక్క రోజులో దేవస్థానం ఖజానాకు రూ.50 లక్షల ఆదాయం



ఆలయంలో భక్తుల రద్దీ

సింహాచలం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి శనివారం తరలివచ్చిన భక్తులతో సింహగిరి కిటకిటలాడిందది. చందన యాత్రను తలపించేలా సింహగిరి అంతటా భక్తులు, వారి రాకపోకలకు వినియోగించిన ద్విచక్ర వాహనాలు, కార్లతో పార్కింగ్ ప్రాంతాలన్నీ నిండిపోయాయి. ఒక దశలో కార్ల పార్కింగ్ సుమారు కిలోమీటరు దూరాన గల సింహగిరి హిల్‌టాప్ రోడ్డుకు చేరింది. భక్తుల రద్దీని గమనించిన దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు ప్రధాన రాజగోపురం వద్ద గల క్యాంపు కార్యాలయంలో కూర్చుని కేశఖండనశాల, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద, దర్శనాల క్యూలలో భక్తుల రద్దీ నియంత్రణకు ఎప్పటికప్పుడు తగిన సూచనలను అధికారులకు ఇచ్చారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు తాగునీరు, చిన్నారులకు పాలు, బిస్కట్లు పంపిణీ జరిగేలా

... మిగతా 6వ పేజీలో


భీమిలిలో బక్రీద్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సాగర్‌నగర్ మసీదులో ముస్లింల ప్రార్థనలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

సాగర్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ కుదుష్ అన్నారు. శనివారం సాగర్‌నగర్ సమీపంలోని తాటిచెట్లపాలెం వద్ద ఉన్న మసీదులో బక్రీదు పురస్కరించుకుని ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ,కరుణ, త్యాగం, ఇవన్నీ జీవితంలో ప్రతి మనిషికి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొమ్మాది : ముస్లింలకు బక్రీద్ పవిత్ర దినమని ముస్లిం మత పెద్ద ఇమామ్ అన్నారు. పీఎంపాలెంలోని మసీద్ ఉస్మానియాలో ఈద్ నమాజ్ ఘనంగా నిర్వహించారు. ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి, ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ మాజీ అధ్యక్షుడు షేక్ సుభాని, కాలనీ అధ్యక్షుడు రెహమాన్, అత్తర్ అప్పా సాహెబ్, బషీరుల్లా ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల ముస్లింలు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఖురాన్‌లోని పలు సూక్తులను మత పెద్దలు చదివి వినిపించారు. మత పెద్ద వసీం అక్తర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.


స్వామివారికి తులసీ దళాలతో అర్చన

అప్పన్నకు వైభవంగా స్వర్ణ తులసీ దళార్చన

సింహాచలం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ తులసీ దళార్చన శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మ నిధి నుంచి స్వర్ణ తులసీ దళాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు.

49 కిలోల చందనం అరగదీత

సింహాచలం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 11న మూడవ విడత సమర్పించనున్న చందనం అరగదీతలో భాగంగా శనివారం 49 కిలోల చందనపు ముద్దను ఆలయ సిబ్బంది అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనాన్ని ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి బాండాగారంలో భద్రపరిచారు. మొత్తం మూడు మణుగులు (125 కిలోల) చందనం అరగదీత తరువాత అందులో సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మిళితం చేసి స్వామివారికి సమర్పిస్తారు.


డీఈఓ ప్రేమ్‌కుమార్‌కు నోటీసు అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

నేడు డీఈవో కార్యాలయం ముట్టడి

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు తప్పుబట్టాయి. ఈమేరకు శనివారం తోటగరువు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపినపుడు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చి ఇప్పుడు అందుకు భిన్నంగా వెబ్ ఆధారంగా చేపడతామని ప్రకటించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి నాయకుల పిలుపుమేరకు ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడించాలని నిర్ణయించారు. ఈనేపథ్యంలో ఉపాధ్యాయ సంఘ నేతలు గోపినాథ్, పైడిరాజు, వేణుగోపాల్, రామకృష్ణ, అంబేడ్కర్, అరుణ్‌కుమార్, ధనుంజయ, చిన్నారావు, సూర్యనారాయణ తదితరులు డీఈవో కార్యాలయానికి వెళ్లి చాంబర్‌లో బైఠాయించి నినాదాలు చేశారు. తరువాత డీఈవో ప్రేమ్‌కుమార్‌కు ముట్టడికి సంబంధించి నోటీస్ అందజేశారు.

శిథిల భవనం తొలగింపు

సాగర్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవానిపాలెంలో శిథిలావస్థలో ఉన్న తుపాను రక్షిత భవనాన్ని జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. పదేళ్ల క్రితం ఈ భవనం శిథిలం కాగా జీవీఎంసీ అధికారులు అప్పట్లో రూ.కోటి వెచ్చించి మరమ్మతులు చేయించారు. ఆ తరువాత కూడా మళ్లీ యథా స్థితి నెలకొనడంతో భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు.

తీరంలో వర్షం

సాగర్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత గ్రామాలైన సాగర్‌నగర్, రుషికొండలో శనివారం సాయంత్రం అర్ధగంట పాటు వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో సేదతీరారు. గత మూడు రోజులుగా మధ్యాహ్నం 3 గంటల వరకూ తీవ్రమైన ఎండ కాస్తుండగా, ఆ తరువాత ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తోంది.

మాజీ ఎమ్మెల్యే సింహాచలం మృతి పట్ల సంతాపం

తగరపువలస, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి పట్ల మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

10న దుర్గాలమ్మ పండగ

కొమ్మాది, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) :చంద్రంపాలెం జాతరగుట్ట దుర్గాలమ్మ వారాల పండగ ఈనెల 10న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు ఆలయ ఆవరణలో సమావేశమై పండగ వివరాలను వెల్లడించారు. 10న ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి బంగారమ్మ అమ్మవారి అనుపు సంబరం జరుగుతుందన్నారు. సాయంత్రం దుర్గాలమ్మ అనుపోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు.

యోగా ర్యాలీ

భీమునిపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేఖ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు.

హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ

మహారాణిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ డిమాండ్ చేశారు. జగదాంబ వద్ద సీఐటీయూ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా కూటమి నేతలు అనేక హామీలిచ్చారని, అధికారంలోకి వస్తే జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పిస్తామని వాగ్దానాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. జులై 9న జరిగే అఖిలభారత సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొంటారని ప్రకటించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలుగా ఆర్. ఈశ్వరమ్మ, అధ్యక్షురాలిగా శోభా రాణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శిగా తులసి ఎన్నికయ్యారు.

ఒరిగిన శిఖరం

... 5వ పేజీ తరువాయి

క్రమబద్ధీకరణ కోసం అరవై మందిని ఢిల్లీ తీసుకువెళ్లి పార్లమెంటు సభ్యులందరికీ లేఖలు ఇప్పించారు. దీనిపై కేంద్రం స్పందించి కార్మికులను రెగ్యులర్ చేయడంతో సింహాచలం షిప్‌యార్డులో కార్మిక నాయకుడిగా ప్రాచుర్యంలోకి వచ్చారు. షిప్‌యార్డుతో పాటు హిందూస్థాన్ జింక్, హెచ్‌పీసీఎల్ కర్మాగారాలలో జరిగిన అనేక కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన 1974లో గాజువాక సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పదేళ్లపాటు అదే పదవిలో కొనసాగారు. అదే సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వాసితుల పక్షాన పోరాటం చేశారు. ఉక్కు కర్మాగారం కోసం ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులు భూములు ఇచ్చారు. కార్మిక నాయకుడిగా, యాదవ సామాజిక వర్గ నేతగా ప్రాచుర్యం పొందిన సింహాచలం 1980లో పెందుర్తి అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు సత్యనారాయణ చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరిన సింహాచలం 1983లో విశాఖ-2 నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ఈసరపు వాసుదేవరావు చేతిలో ఓడిపోయారు. అనంతరం సింహాచలం తెలుగు దేశం పార్టీలో చేరారు. 1989లో పెందుర్తి నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి గుడివాడ గురునాథరావు చేతిలో ఓటమి చెందారు. 1994 ఎన్నికల్లో విశాఖ-2 నుంచి టీడీపీ తరఫున పోటీచేసి విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో పల్లా సింహాచలానికి టికెట్ లభించలేదు. తిరిగి 2004లో విశాఖ-2 నుంచి టీడీపీ తరఫున బరిలో దిగి కాంగ్రెస్ అభ్యర్థి సరిపల్లి రంగరాజు చేతిలో ఓటమి చెందారు. ఆయన వారసునిగా పల్లా శ్రీనివాసరావు రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా, గాజువాక ఎమ్మెల్యేగా ఉన్నారు. సింహాచలం అంత్యక్రియలు ఆదివారం గాజువాకలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

సింహాచలం మృతికి నేతల నివాళి

సీతంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని శనివారం సీతంపేటలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ గృహంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. స్థానికులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు సింహాచలం పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణ బాబు, గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మాజీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు పల్లా సింహాచలం పార్థివ దేహానికి నమస్కరించి నివాళులర్పించారు. ఆదివారం ఉదయం సీతంపేట నుంచి గాజువాకలో గల వారి స్వగృహానికి భౌతిక కాయాన్ని తరలిస్తారు.

నగర పరిశుభ్రత అందరి బాధ్యత


కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ విద్యార్థులు

సాగర్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో స్వచ్ఛంద సేవకుల సేవలు అవసరమని హైదరాబాద్‌లోని అమెరికన్ కౌన్సిలేట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. శనివారం ఉదయం రుషికొండ బీచ్‌లో ఏయూ అమెరికన్ కార్నర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో అవసరమన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచడానికి దోహదపడతాయని చెప్పారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్. ధనుంజయరావు మాట్లాడుతూ బీచ్ పరిసరాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం కమ్యూనిటీ డే కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లకు అతిథులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ క్రీడా విభాగం సంచాలకుడు ప్రొఫెసర్ ఎన్. విజయ్‌మోహన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్. హరినాథ్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్ఎం యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తాత్కాలికంగా కొన్ని సేవలు నిలిపివేత

భీమునిపట్నం (రూరల్), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల ఆధ్వర్యంలోని ఏపీ సేవా పోర్టర్‌లో కొన్ని సేవలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని ఎంపీడీఓ హనుమంతరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ సేవా పోర్టర్‌లో ఉన్న కొన్ని సేవలను ఆంధ్రప్రదేశ్ డేటా సెంటర్‌కు తరలింపు (మైగ్రేషన్) చేస్తున్నందున ప్రభుత్వం తాత్కాలికంగా కొన్ని సేవలను నిలుపుదల చేసిందన్నారు. ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, భూముల మ్యూటేషన్లు, రేషన్‌కార్డుల మార్పిడి, రైస్ మిల్లుల నమోదు, ఇళ్ల స్థలాల పట్టాలు, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ, నీటి పన్ను, పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్యశాఖ సేవలను తాత్కాలికంగా నిలుపుదల చేశారని తెలిపారు. శనివారం నుంచి మంగళవారం వరకు సచివాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉండవని, ప్రజలు గమనించాలన్నారు. ఈనెల 11 నుంచి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

తునిపాలెం రామాలయంలో భజన చెట్టు ప్రతిష్ఠ

పద్మనాభం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెం రామాలయంలో నూతనంగా తయారు చేసిన భజన చెట్టును శనివారం ప్రతిష్ఠించారు. తొలుత భజన చెట్టును గ్రామంలో ఊరేగించారు.అనంతరం ఆలయంలో ప్రతిష్ఠ చేసి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కె.నగేష్‌కుమార్, వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు బి. సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

8న అర్చకునిపాలెంలో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ

పద్మనాభం,జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం పంచాయతీ పరిధి అర్చకునిపాలెంలో ఈనెల 8న పైడితల్లి, మరిడమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు.

సీఐటీయూ ధర్నా


ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కొమ్మాది, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ నాయకులు శనివారం జోన్-2 కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మద్దిలపాలెం జోన్ అధ్యక్షుడు అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కార్మికులకు 12 గంటల పని దినాన్ని అమలు చేస్తామనడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌ను అమలు చేసే ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 12 గంటల పనిని, మహిళలకు నైట్ షిఫ్ట డ్యూటీ అమలు చేయాలన్న రాష్ట్రప్రభుత్వ నిర్ణ యాన్ని వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు.

సప్లిమెంటరీలోనూ వెనుకంజ

... 5వ పేజీ తరువాయి

దారుణంగా పడిపోయింది. ప్రథమ సంవత్సర ఫలితాల్లో 46 శాతంతో పదో స్థానం, ద్వితీయ సంవత్సరంలో 63 శాతంతో 12వ స్థానానికి దిగజారింది. శనివారం విడుదలైన ఫలితాల ప్రకారం ప్రథమ సంవత్సర పరీక్షలకు 7,388 మంది విద్యార్థులు హాజరవ్వగా కేవలం 3,414 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఫలితంగా ఉత్తీర్ణత 46 శాతంగా నమోదైంది. వొకేషనల్ గ్రూపులకు సంబంధించి 456 మంది పరీక్షలు రాయగా 243 మంది ఉత్తీర్ణులై 53 శాతంతో రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచారు. జిల్లాలోని 154 ప్రైవేటు కళాశాలల నుంచి 6,241 మంది పరీక్షలకు హాజరవ్వగా కేవలం 48.69 శాతంతో 3,039 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ద్వితీయ సంవత్సర ఫలితాలు

జిల్లా నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 6,187 మంది హాజరవ్వగా 63 శాతంతో 3,920మంది ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్ గ్రూపుల నుంచి 361 మంది పరీక్షలు రాయగా 76 శాతంతో 274 మంది ఉత్తీర్ణులయ్యారు.ఫలితంగా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచారు. కాగా 141 ప్రైవేటు కాలేజీల నుంచి 5,180 మంది పరీక్షలకు హాజరవ్వగా 65.56 శాతంతో 3,396 మంది ఉత్తీర్ణులయ్యారు. వార్షిక ఫలితాల్లో ప్రైవేటు కళాశాలలు 84 శాతం ఉత్తీర్ణత సాధించగా, సప్లిమెంటరీలో 63 శాతానికే పరిమితమయ్యాయి. దీంతో జిల్లా స్థానం రాష్ట్రస్థాయిలో కిందకు పడిపోయింది.

తీరు మారని ప్రభుత్వ కళాశాలలు

వార్షిక ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వెనకబడడంతో రాష్ట్ర ప్రభుత్వం సప్లిమెంటరీపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. వేసవి సెలవుల్లో సైతం ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏప్రిల్ 14 నుంచి మే 10వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వార్షిక ఫలితాల్లో జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రథమ సంవత్సరంలో 34.17 శాతం, ద్వితీయ సంవత్సరంలో 55 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఫలితాలపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమావేశం నిర్వహించి జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు, ప్రిన్సిపాళ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అయినప్పటికీ సప్లిమెంటరీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు దారుణమైన ఫలితాలు సాధించాయి. 9 జూనియర్ కళాశాలల నుంచి 856 మంది పరీక్షలు రాయగా 30.49 శాతంతో 261 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 7 హైస్కూళ్ల ప్లస్ నుంచి 132 మంది పరీక్షలకు హాజరవ్వగా 21.97 శాతంతో 29 మందే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 772 మంది పరీక్షలు రాయగా 52.72 శాతంతో 407 మంది ఉత్తీర్ణులయ్యారు. 6 హైస్కూల్స్ ప్లస్ నుంచి 79 మంది పరీక్షలు రాయగా 34.18 శాతంతో 27 మంది ఉత్తీర్ణత సాధించారు.

సింహగిరి కిటకిట

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దేవస్థానం ఖజానాకు శనివారం ఒక్కరోజే రూ.50,93,115 లక్షల ఆదాయం సమకూరినట్టు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఆదాయంలో సింహభాగం శ్రీఘ్రదర్శనం రూ.100, అతి శ్రీఘ్రదర్శనం రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ. 28,64,200 సమకూరగా, రూ.15 లడ్డూ ప్రసాదం, రూ.10 పులిహోర ప్రసాదాల అమ్మకాల ద్వారా రూ.13,72,960 ఆదాయం లభించింది. ప్రసాదాలు, దర్శనాల టికెట్లతోపాటు భక్తులు సమర్పించిన తలనీలాల టికెట్లు రూ.40 విక్రయాల ద్వారా రూ.3,98,960, విరాళాల రూపంలో రూ.2,25,008, నిత్య కల్యాణం, ఆర్జిత సేవల టికెట్ల అమ్మకాల ద్వారా రూ.94,480, వసతి, రవాణా విభాగాలతో కలిపి మొత్తం రూ.50,93,115 ఆదాయం సమకూరింది.

ఏయూలో అక్రమాలపై విచారణ

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. ప్రభుత్వం మారగానే ప్రసాదరెడ్డిపై చర్యలు తీసుకుంటుందని అంతా భావించారు. ఏదో ఒకటి చేస్తారని ఆయన కూడా కొన్నాళ్లు సెలవు పెట్టి వెళ్లిపోయారు. క్యాంపస్ నిండా తన మనుషులే కాబట్టి విచారణ చేపట్టినా ఏమీ కాదని భావించారు. మళ్లీ విధుల్లో చేరారు. అయితే మూడు నెలల కిందట అసెంబ్లీలో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు వంటి వారంతా ప్రసాదరెడ్డి వ్యవహారాన్ని ప్రస్తావించారు. దీంతో అసెంబ్లీ వేదికగా మంత్రి లోకేష్ స్పందించారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విజిలెన్స్ విచారణ పూర్తిచేసి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అయితే, ఇప్పటివరకూ విజిలెన్స్ విచారణ చేపట్టలేదని అంతా భావిస్తున్నారు. కానీ విచారణ జరుగుతోందని, చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామని ఎంపీ శ్రీభరత్ శనివారం స్పష్టంచేశారు. ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ కొత్త వారితో టీమ్ ఏర్పాటు చేసుకున్నారని, పాలన మొదలవుతుందన్నారు. ఏదీ కక్ష సాధింపుతో చేయబోమని, చట్టప్రకారమే కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి తొలగిన అడ్డంకులు

... 5వ పేజీ తరువాయి

(డీపీఆర్) తయారుచేశారు. ప్రస్తుతం ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండగా వాటిని ఇంకో రెండు పెంచి పది చేయాలని అనుకున్నారు. వాటి కోసం జ్ఞానాపురం వైపు చెట్లను తొలగించి పనులు కూడా చేపట్టారు. అయితే కొత్త డీపీఆర్‌లో ఇంకో నాలుగు ప్లాట్‌ఫారాలు పెంచి మొత్తం 14 చేయాలని నిర్ణయించారు. మరికొన్ని అదనపు పనులు కూడా చేర్చారు. ఈ డీపీఆర్‌ను ఢిల్లీకి పంపించారు. దానికి ఆమోదం లభించాల్సి ఉంది. అక్కడ అంగీకారం లభించగానే అక్టోబరులో పనులు ప్రారంభించి, అక్కడి నుంచి 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

2027 మేకు పూర్తి

\- శ్రీభరత్, విశాఖ ఎంపీ

రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు 2027 మే నాటికి పూర్తయిపోతాయని విశ్వాసం ఉంది. ఇప్పుడు మంచి సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. డీపీఆర్ ఆమోదించగానే పనులు మొదలవుతాయి. చాలా వేగంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము.

ఈవీల ఛార్జింగ్ స్టేషన్‌కు స్థల పరిశీలన

సాగర్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో నడపనున్న డబుల్ డెక్కర్ బస్సుల ఛార్జింగ్ స్టేషన్‌కు విద్యుత్ శాఖాధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. ఇస్కాన్ సమీపంలో ఉన్న ఏపీ టూరిజం స్థలంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ ప్రతిపాదించింది. ఈమేరకు అధికారులు స్థలాన్ని పరిశీలించారు.

జోన్ -2 కార్యాలయాన్ని తరలించొద్దని వినతి

మధురవాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జోన్ల పునర్విభజనలో భాగంగా మధురవాడలో ఉన్న జోన్ - 2 కార్యాలయాన్ని భీమిలికి తరలించవద్దని ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ కోరారు. శనివారం ఆమె జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్-2 పరిధిలోని 5,6,7,8 వార్డుల ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియజేయడానికి మధురవాడ కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు.

ఉన్నవి వదిలేసి, బయట కొనుగోలు చేసి...!

... 5వ పేజీ తరువాయి

అధికారులు మాత్రం వాటిని నిర్లక్ష్యం చేసి బయట నుంచి కొనుగోలు చేయడం విశేషం. ఒక్క కేజీహెచ్‌లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రభుత్వాస్పత్రుల్లో ఇదే విధానాన్ని అనుసరిస్తుండడం గమనార్హం. దీని వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

అధికారుల వాదన ఇదీ..

ప్రస్తుతం గాలి ద్వారా ఆక్సిజన్ తయారుచేయాలంటే భారీగా ఖర్చవుతుందని, అందులో కూడా ప్యూరిటీ తక్కువగా ఉంటుందని కేజీహెచ్ అధికారులు చెబుతున్నారు. అయితే, ప్యూరిటీ తక్కువగా ఉంటే కొవిడ్ రోగులకు ఎలా అందించారన్న ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది. ఆ ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్‌ను రోగుల అవసరాలకు వినియోగించుకోవచ్చునని, కొన్నిరకాల వ్యాధులతో బాధపడే రోగులకు లిక్విడ్ ఆక్సిజన్ కావాల్సి వస్తే బయట కొనుగోలు చేయవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. పూర్తిగా కొనుగోలు చేసిన లిక్విడ్ ఆక్సిజన్‌పై ఆధారపడి, ఆస్పత్రిలో ఉన్న ప్లాంట్లను మూలకు చేర్చడం సమంజసం కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానందను వివరణ కోరగా...ఆక్సిజన్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకువచ్చే పనిలో ఉన్నట్టు చెప్పారు. ఆక్సిజన్ ప్లాంట్ల ద్వారా తయారు చేసే ఆక్సిజన్‌తో పోలిస్తే లిక్విడ్ ఆక్సిజన్ క్వాలిటీ బాగుంటుందన్నారు. దీనిపై చాలాకాలం స్టడీ చేసిన తరువాతే కొనుగోలు చేస్తున్నామని, అయినప్పటికీ ఆక్సిజన్ ప్లాంట్లను పూర్తిగా వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు.

డిసెంబరు 31 నుంచి సీఐటీయూ మహాసభలు

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను ఈ ఏడాది డిసెంబరులో నగరం వేదికగా నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలకు ఏర్పాట్లు, నిర్వహణపై 'ఆహ్వాన సంఘం' ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సమావేశమవుతుందన్నారు. డిసెంబరు 31 నుంచి జనవరి నాలుగు వరకూ ఐదు రోజులపాటు మహాసభలు జరుగుతాయన్నారు.

10న ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

... 5వ పేజీ తరువాయి

సమీక్షిస్తారు. సీఎం పర్యటనకు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్ రావలసి ఉంది. ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడ నుంచి రోడ్డు మార్గాన పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళతారు. ఆరోజు రాత్రి నగరానికి చేరుకుని టీడీపీ కార్యాలయంలో బస చేస్తారు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి విజయవాడ వెళతారు.

స్పెషల్‌బ్రాంచిలో చక్రం తిప్పుతున్న సీఐ

... 5వ పేజీ తరువాయి

పెడుతుంటారని, కొద్దిరోజుల కిందటివరకు పోర్టుకు వచ్చే విదేశీయులకు తాత్కాలిక వీసాల జారీకి తనకు లేని అధికారాన్ని చలాయించి ఏజెంట్ల నుంచి వసూళ్లకు పాల్పడ్డారని సిబ్బందే ఆరోపిస్తున్నారు. దీనిపై సీపీకి సమాచారం ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదనే అభిప్రాయం ఉంది. అలాగే విదేశీ పౌరసత్వం కలిగిన ఒక ఎన్ఆర్ఐ కుటుంబం ఇటీవల నగరానికి రాగా, తాత్కాలిక వీసా కోసం ఆయన డబ్బులు డిమాండ్ చేసినట్టు ఎంబసీ ద్వారా సీపీకి ఈ-మెయిల్‌లో ఫిర్యాదు అందినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. దీనిపై సీపీ చర్యలు తీసుకుంటారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలను నాలుగు రోజుల క్రితం అంతర్గతంగా బదిలీ చేసిన సీపీ...ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి స్పెషల్‌బ్రాంచిలోనే కీలకమైన బాధ్యతలు అప్పగించడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అసలు స్పెషల్‌బ్రాంచిలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని అధికారులు, సిబ్బంది అంటున్నారు. ఉన్నతాధికారులను సదరు అధికారి ప్రసన్నం చేసుకున్నారని, అందుకే అతని వ్యవహారాలను సీపీ దృష్టికి చేరకుండా వారంతా కాపాడడమే కాకుండా ఇతర అధికారులపై నెట్టేస్తున్నారని స్పెషల్ బ్రాంచి అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో యోగాంధ్ర రేపు

సిరిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఈ నెల 9న యోగాసనాల కార్యక్రమం యోగాంధ్ర నిర్వహిస్తున్నట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. సోమవారం ఉదయం 7 నుంచి 8 వరకు బీచ్‌రోడ్డు వుడా పార్కు దరి ఎంజీఎం పార్కు లాన్‌లో జరిగే యోగాసనాల కార్యక్రమంలో నగర ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ప్రవేశం ఉచితమని ముఖ్యంగా యోగా సంస్థలకు చెందిన గురువులు, యోగాభ్యాసకులు పాల్గొనాలని కోరారు. పాల్గొనేవారు సోమవారం ఉదయం 6.30 గంటలకు చేరుకోవాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే సింహాచలం మృతికి వీఎంఆర్డీఏ చైర్మన్ సంతాపం

సిరిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతికి వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ సంతాపం తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే , వుడా బోర్డు మాజీ సభ్యులు ఆకాల మృతి పార్టీకి తీరని లోటు అన్నారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 5 మంది గురుకుల విద్యార్థులు ఉత్తీర్ణత

ఆరిలోవ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో ఐదుగురు విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కాగా, వారిలో ముగ్గురు ఉత్తీర్ణులు అయినట్టు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 11 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో ఇద్దరు ఉత్తీర్ణులైనట్టు ఆమె తెలిపారు.

ఘనంగా లక్ష్మీనారాయణుల కల్యాణం



కల్యాణ్యం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో లక్ష్మీనారాయణుల వార్షిక తిరుకల్యాణం శనివారం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏటా జేష్ట మాస శుక్లపక్ష ఏకాదశి రోజు లక్ష్మీనారాయణుల వార్షిక తిరుకల్యాణం చేయడం ఆనవాయితీ. ఉదయం గరుడ ధ్వజారోహణం జరిపారు. అనంతరం లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో శ్రీకారం చుట్టి ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు,కరి సీతారామాచార్యులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. శాస్త్ర విధానంలో కల్యాణం జరిపారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 35 దొండకాయలు 28, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)52, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 130, కీరదోస 38, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

ప్రధాని మోదీ మనకు ఆదర్శం

- ఎంపీ శ్రీభరత్
- యోగాంధ్ర కోసం గాదిరాజు ప్యాలెస్‌లో యోగా సాధన

ఎంవీపీ కాలనీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : యోగా విషయంలో మనందరికీ ప్రధాని నరేంద్ర మోదీ ఆదర్శమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో మరింత అవగాహన, చైతన్యం తెచ్చేందుకు వీలుగా ఓం శ్రీ యోగా సంస్థ ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శనివారం ఉదయం యోగా ప్రత్యేక ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి రోజూ రెండు గంటలు యోగా కోసం కేటాయిస్తారన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ పలు యోగాసనాలు వేశారు.

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ గిన్నీస్ రికార్డు కోసం చేస్తున్న యోగాంధ్ర కార్యక్రమం విషయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తన ఉల్లాసానికి యోగాయే కారణమన్నారు. యోగా గురువు డాక్టర్ చిలక వెంకట రమేష్ ఉచిత సేవలు ప్రశంసనీయమన్నారు.

నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు విభిన్న ఆసనాలతో ప్రత్యేక ప్రదర్శన చేశారు. దేశభక్తి గీతాలకు యోగాసనాల ప్రదర్శన ఆకట్టుకుంది. సీఎమ్మార్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ, ఆయుష్ విభాగ అధికారి ఝాన్సీ, గాదిరాజు వర్మ, విశ్వ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల చైర్మన్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఎంపీ శ్రీభరత్



యోగ సాధనలో పాల్గొన్న నగర వాసులు



యోగాసనాలు వేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, వేదికపై ఉత్తర నియోజవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, వేదికపై ఎమ్మెల్యేలు వెలగపూడి, వంశీకృష్ణ శ్రీనివాస్, పల్లా శ్రీనివాసరావు, అసోసియేషన్ సీఈవో శ్రీనివాసరావు తదితరులు

ఎంవీపీ కాలనీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎస్ 3 స్పోర్ట్స్ ఎరీనాలో షటిల్ బ్యాడ్మింటన్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ నెల పది వరకూ నిర్వహించనున్న పోటీల ప్రారంభోత్సవానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, దక్షణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, అసోసియేషన్ సీఈవో శ్రీనివాసరావు, కార్పొరేటరు గొలగాని మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డులో గోడలపై యోగాసనాల పెయింటింగ్స్



నగరంలో ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులో గోడలపై శనివారం రాత్రి ప్రొజెక్టర్ ద్వారా నీడ ఆధారంగా యోగాసనాల పెయింటింగ్ వేస్తున్న చిత్రకారుడు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

ఏయూ అమెరికన్ కార్నర్ ఆధ్వర్యంలో తీర ప్రాంత శుభ్రత



రుషికొండ తీరంలో ఏరివేసిన వ్యర్థాలతో అమెరికన్ కౌన్సిల్ జెన్నిఫర్ లార్సర్, వీసీ జీపీ రాజశేఖర్

సిరిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వలంటీర్ల సేవలు అవసరమని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. శనివారం రుషికొండ బీచ్ వద్ద ఏయూ అమెరికన్ కార్నర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ డే కార్యక్రమంలో కౌన్సిల్ జనరల్ విద్యార్థులు, వలంటీర్లతో కలిసి సాగర తీర పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, వలంటీర్లతో కలిసి బీచ్‌లో ఉన్న వ్యర్థాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడతాయన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ బీచ్ పరిసరాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. తదుపరి వలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏయూ క్రీడా విభాగ సంచాలకులు ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.హరినాథ్, ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ ఎంఎస్ యుగంధర్, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ పబ్లిక్ డిప్లొమసీ అధికారి ఎమిలియా స్మిత్, అమెరికన్ స్పేసెస్ కో-ఆర్డినేటర్ మెలిస్సానందుల, ఏయూ అమెరికన్ కార్నర్ కో-ఆర్డినేటర్ పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి వైసీపీ సర్పంచ్



సందీప్‌ను సత్కరిస్తున్న విలాస్ఖాన్‌పాలెం సర్పంచ్ సత్యవతి

పద్మనాభం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన విలాస్‌ఖాన్‌పాలెం పంచాయతీ సర్పంచ్ నల్లి సత్యవతి శనివారం జనసేన పార్టీలో చేరారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో తీసుకువస్తున్న సంస్కరణలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు ఆమె తెలిపారు. ఈమేరకు ఎండాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పంచకర్ల సందీప్ ఆమెకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమెతో పాటు ఆమె కుమారుడు బంగారునాయుడు కూడా జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ రామస్వామినాయుడు, పార్టీ బూత్ కమిటీ కన్వీనరు శ్రీనుబాబు, మూడో వార్డు అధ్యక్షుడు అక్కరమాని దివాకర్, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు వీబీ నాయుడు, అనిల్, శివ, సోమేష్ పాల్గొన్నారు.

బక్రీద్ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఆరిలోవ. జూన్7 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లిం సోదరులు శనివారం మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నమాజ్‌లు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మసీదుల్లో మత పెద్దలు ఇస్లాం బోధనలతో పాటు బక్రీద్ విశిష్టతను వివరించారు.

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని బలోపేతం చేయాలి : అజశర్మ

విశాఖపట్నం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని బలోపేతం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ అజశర్మ ఒక ప్రకటన ద్వారా భారత రాష్ట్రపతిని కోరారు. 180 మంది విద్యార్థులున్న ట్రైబల్ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది కొరతగా ఉందని, హాస్టల్ సౌకర్యంలేక తగిన వసతులులేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ యూనివర్సిటీలో 50శాతం సీట్లు గిరిజన విద్యార్థులకు నియమాలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

పెదజాలారిపేటలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



కింది భాగంలో తుప్పు పట్టి పాడైన విద్యుత్ స్తంభం

పెదవాల్తేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు వాల్తేరు డిపో పెదజాలారిపేట వద్ద గల ప్రధాన కూడలి చేపల మార్కెట్, ప్రజా ఆరోగ్య కేంద్రం (గీతం హాస్పిటల్) దేవాలయాలు వద్ద హైమాస్ట్ విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ ఉన్న ప్రజా ఆరోగ్య కేంద్ర, చేపల మార్కెట్, దేవాలయాలకు పెదజాలారిపేట, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. దీంతో ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అయితే తప్పు పట్టిన ఈ విద్యుత్ స్తంభాలు ఎప్పుడు పడిపోతాయో అన్నట్టుగా ఉండడంతో అంతా ఆందోళన చెందుతున్నారు.

అలాగే కొద్ది నెలల నుంచి హైమాస్ట్ లైట్స్ వెలగడం లేదని, చీకటి పడితే అంధకారం నెలకొని ఉండడంతో ఈ ప్రాంతంలో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో రాత్రి బైటకు రావడానికే భయమేస్తోందని మహిళలు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడకి ఎలక్ట్రికల్ సిబ్బంది వచ్చినా కింది భాగంలో పూర్తిగా తుప్పు పట్టి ఉండడంతో స్తంభం ఎక్కి లైట్లు వేయడానికి భయపడుతున్నారు.

దీంతో ఆరు నెలలుగా ఇక్కడ రాత్రి వేళల్లో దీపాలు వెలగక అంధ కారం నెలకొంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకొని వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రధాన కూడలిలో కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

విశాఖ అభివృద్ధిపై సీఎం వ్యాఖ్యలు భేష్

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర



మాట్లాడుతున్న రవీంద్ర

పెదవాల్తేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖను ఆర్థిక శక్తిగా ముందుకు తీసుకొని వెళ్తామని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొనడం పట్ల బీజేపీ విశాఖ మాజీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. అందుకు అపారమైన అవకాశాలు కూడా విశాఖలో ఉన్నాయి అని గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విశాఖ అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. గత ప్రభుత్వం విశాఖలో ప్రభుత్వ స్థలాలను, కట్టడాలను తాకట్టు పెట్టి కోట్ల రూపాయిలు దుర్వినియోగం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా విశాఖ ప్రజలలో అభివృద్ధి పట్ల ఆశలు చిగురిచాయని తెలిపారు. అయితే రాష్ట్రంలోనే అతి పెద్ద నగరం విశాఖ కార్పొరేషన్‌కు గత కొంత కాలంగా కమీషనర్ లేకపోవడం పట్ల నిస్మయ్యం వ్యక్తం చేసారు. అలాగే రాష్ట్ర ఆహార పరీక్ష కేంద్రాన్ని పూర్తి స్థాయిలో నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని సాక్షాత్తు ప్రధాని గత సంవత్సరం ఫిబ్రవరిలో ప్రారంభించిన పరీక్ష కేంద్రాన్ని ఇంత వరకు వాడుకలోకి తేవకపోవడం పట్ల స్థానికులు విస్మయ్యం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ రోజు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం దృష్ట పెట్టి ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ రాక సమయానికి పూర్తి చేయ్యాలని కోరారు.

పాలనాపరమైన కారణం చూపుతూ బదిలీలు

- ఖజానా శాఖలో ఉన్నతాధికారుల లీలలు

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఖజానా శాఖలో చేపట్టిన బదిలీల్లో ఉన్నతాధికారులు లీలలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ శాఖలలో బదిలీలకు సంబంధించి జారీ చేసిన జీవో నంబరు 30కు విరుద్ధంగా ఖజానాలో బదిలీలు చేశారని ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. పాలనాపరమైన సౌలభ్యం పేరిట బదిలీల విషయంలో పేర్కొన్న అంశానికి భిన్నంగా పలువురు ఉద్యోగులను విశాఖ, పాడేరు జిల్లా ఖజానా కార్యాలయాల నుంచి సీతమ్మధారలోని సబ్‌ట్రెజరీకి బదిలీ చేశారు. 'పాలనా సౌలభ్యం' పేరిట అనే పదం చేర్చి బదిలీ చేశారని ఆరోపిస్తున్నారు.

ఏజెన్సీలో ఏళ్ల తరబడి పని చేసిన వారి ప్రాధాన్యత పట్టించుకోకుండా బదిలీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీలల్లో పారదర్శకత లేకుండా ఉన్నతాధికారులు తమకు అనుకూలంగా ఉండే వర్గానికి పెద్ద పీట వేశారనే అంటున్నారు. ఖజానా కార్యాలయంలో బదిలీలల్లో ఉన్నతాధికారులు నిర్వాకంపై జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలను కలిసి విన్నవించాలని పలువురు ఉద్యోగులు నిర్ణయించారు.

కమనీయం.. స్వాముల కల్యాణోత్సవం


రమా సత్యనారాయణ స్వాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు


వేంకటేశ్వరస్వామికి పల్లకి సేవ


అంబికాబాగ్‌లో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

మహారాణిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు తీరంలోని శృంగమణి పర్వతంపై వెలసిన వెంకటేశ్వరస్వామి, ఇసుకకొండపై రమా సత్యనారాయణస్వాముల తిరు కల్యాణ మహోత్సవాలు, అంబికా బాగ్‌లోని రామాలయంలో సీతారాముల వార్షిక కల్యాణోత్సవాలు శనివారం కమనీయంగా జరిగాయి. వన్‌టౌన్‌లోని పోర్టు ఏరియాలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 6న ప్రారంభమైన కల్యాణోత్సవాలు 12 వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం పెద్దఎత్తున విచ్చేసిన భక్తుల సమక్షంలో కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా జరిపించారు. ఆదివారం తిరువీధులలో గరుడవాహన సేవ నిర్వహిస్తారు. 10న సాయంత్రం సాగర జలాల్లో పైలెట్ లాంచి పై తెప్పోత్సవం జరుగుతుంది. 12న పుష్పాంజలి సేవ జరిగాక, 22న 16 రోజుల పండుగ పాలి కా విసర్జనంతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ఈవో ఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

» వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తుల సమక్షంలో వేద పండితులు స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ నెల 5న ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేనుల పూజతో అంకురార్పణ చేసి అగ్ని ప్రతిష్ఠాపన హోమాలు నిర్వహించారు. శుక్రవారం ఏకాదశి పర్వదినాన ధ్వజారోహణం జరిగింది. 11న జ్యేష్ఠ పౌర్ణమి వేడుకలు, 12న పుష్పయాగం, పవళింపు సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ఈవో టి.రాజగోపాల రెడి తెలిపారు.

» మహారాణిపేటలోని అంబికాబాగ్ రామాలయంలో సీతారామ చంద్రమూర్తి వార్షిక కల్యాణ మహోత్సవాలు భక్తిపారవశ్యంతో నిర్వహించారు. వేకువజాము నుంచే వేద పండితుల ఆధ్వర్యంలో సీతారాములుకు ప్రత్యేక పూజలు జరిపించి అనంతరం కల్యాణ వేడుకలు నిర్వహించారు. మూడు ప్రాంతాలకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి వేడుకలను తిలకించారు. అనంతరం స్వామి వార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంగన్‌వాడీల హామీల అమలుకు డిమాండ్

మహారాణిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీఐటీయూ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ వర్కర్సు యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా కూటమి పార్టీలు అనేక హామీలిచ్చారని, అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పిస్తామని వాగ్దానాలు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అధికారం చేపట్టి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కావడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. జులై 9న జరిగే అఖిలభారత సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొంటారని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ సిబ్బందికి వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్ ఈశ్వరమ్మ, అధ్యక్షురాలిగా శోభారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శిగా తులసి, ఇతర కార్యవర్గాన్ని ప్రకటించారు.

స్పెషల్‌బ్రాంచిలో చక్రం తిప్పుతున్న సీఐ

... 5వ పేజీ తరువాయి

పెడుతుంటారని, కొద్దిరోజుల కిందటివరకు పోర్టుకు వచ్చే విదేశీయులకు తాత్కాలిక వీసాల జారీకి తనకు లేని అధికారాన్ని చలాయించి ఏజెంట్ల నుంచి వసూళ్లకు పాల్పడ్డారని సిబ్బందే ఆరోపిస్తున్నారు. దీనిపై సీపీకి సమాచారం ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదనే అభిప్రాయం ఉంది. అలాగే విదేశీ పౌరసత్వం కలిగిన ఒక ఎన్ఆర్ఐ కుటుంబం ఇటీవల నగరానికి రాగా, తాత్కాలిక వీసా కోసం ఆయన డబ్బులు డిమాండ్ చేసినట్టు ఎంబసీ ద్వారా సీపీకి ఈ-మెయిల్‌లో ఫిర్యాదు అందినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. దీనిపై సీపీ చర్యలు తీసుకుంటారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలను నాలుగు రోజుల క్రితం అంతర్గతంగా బదిలీ చేసిన సీపీ...ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి స్పెషల్‌బ్రాంచిలోనే కీలకమైన బాధ్యతలు అప్పగించడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అసలు స్పెషల్ బ్రాంచిలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని అధికారులు, సిబ్బంది అంటున్నారు. ఉన్నతాధికారులను సదరు అధికారి ప్రసన్నం చేసుకున్నారని, అందుకే అతని వ్యవహారాలను సీపీ దృష్టికి చేరకుండా వారంతా కాపాడడమే కాకుండా ఇతర అధికారులపై నెట్టేస్తున్నారని స్పెషల్ బ్రాంచి అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి తొలగిన అడ్డంకులు

... 5వ పేజీ తరువాయి

(డీపీఆర్) తయారుచేశారు. ప్రస్తుతం ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండగా వాటిని ఇంకో రెండు పెంచి పది చేయాలని అనుకున్నారు. వాటి కోసం జ్ఞానాపురం వైపు చెట్లను తొలగించి పనులు కూడా చేపట్టారు. అయితే కొత్త డీపీఆర్‌లో ఇంకో నాలుగు ప్లాట్‌ఫారాలు పెంచి మొత్తం 14 చేయాలని నిర్ణయించారు. మరికొన్ని అదనపు పనులు కూడా చేర్చారు. ఈ డీపీఆర్‌ను ఢిల్లీకి పంపించారు. దానికి ఆమోదం లభించాల్సి ఉంది. అక్కడ అంగీకారం లభించగానే అక్టోబరులో పనులు ప్రారంభించి, అక్కడి నుంచి 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

2027 మేకు పూర్తి

రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు 2027 మే నాటికి పూర్తయిపోతాయని విశ్వాసం ఉంది. ఇప్పుడు మంచి సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. డీపీఆర్ ఆమోదించగానే పనులు మొదలవుతాయి. చాలా వేగంగా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

-ఎంపీ భరత్

కేజీహెచ్‌లో మెరుగైన సదుపాయాలు: వంశీకృష్ణ


రోగుల నిరీక్షణ గది ప్రారంభిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీపీ బాగ్చి, చిత్రంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తదితరులు

మహారాణిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో మెరుగైన సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేయనున్నట్లు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం కేజీహెచ్‌లో పోలీసు అవుట్ పోస్టు, టెస్లా సెంటర్ వద్ద రోగుల నిరీక్షణ ప్రాంతంలో పలుషెడ్లను ఎమ్మెల్యే వంశీకృష్ణ, పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కేజీహెచ్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దటంలో స్థానిక వైద్య సిబ్బంది కృషిని అభినందించారు. రోగులు, వారి కుటుంబ సభ్యులకు నిరంతరం మెరుగైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్య అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీతంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం అర్జీదారులకు అందజేశారు. 37వ వార్డుకు చెందిన ఎస్.దానియమ్మ, 34వ వార్డుకు చెందిన ఎస్.అప్పలరాజుకు రూ.50 వేల వంతున, 38వ వార్డుకు చెందిన మున్నం చంద్రమౌళికి రూ.94,345 చెక్కులను ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్‌లు అందజేశారు. కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు.

10న సీఎం రాక

... 5వ పేజీ తరువాయి

సమీక్షిస్తారు. సీఎం పర్యటనకు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్ రావలసి ఉంది. ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడ నుంచి రోడ్డు మార్గాన పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళతారు. ఆరోజు రాత్రి నగరానికి చేరుకుని టీడీపీ కార్యాలయంలో బస చేస్తారు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి విజయవాడ వెళతారు.

ఏయూలో అక్రమాలపై విచారణ

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. ప్రభుత్వం మారగానే ప్రసాదరెడ్డిపై చర్యలు తీసుకుంటుందని అంతా భావించారు. ఏదో ఒకటి చేస్తారని ఆయన కూడా కొన్నాళ్లు సెలవు పెట్టి వెళ్లిపోయారు. క్యాంపస్ నిండా తన మనుషులే కాబట్టి విచారణ చేపట్టినా ఏమీ కాదని భావించారు. మళ్లీ విధుల్లో చేరారు. అయితే మూడు నెలల కిందట అసెంబ్లీలో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు వంటి వారంతా ప్రసాదరెడ్డి వ్యవహారాన్ని ప్రస్తావించారు. దీంతో అసెంబ్లీ వేదికగా మంత్రి నారా లోకేష్ స్పందించారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విజిలెన్స్ విచారణ పూర్తిచేసి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అయితే, ఇప్పటివరకూ విజిలెన్స్ విచారణ చేపట్టలేదని అంతా భావిస్తున్నారు. కానీ విచారణ జరుగుతోందని, చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామని ఎంపీ శ్రీభరత్ శనివారం స్పష్టంచేశారు. ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ కొత్త వారితో టీమ్ ఏర్పాటు చేసుకున్నారని, కొత్తపాలన మొదలవుతుందన్నారు. ఏదీ కక్ష సాధింపుతో చేయబోమని, చట్టప్రకారమే కచ్చితంగా చర్యలు ఉంటాయని, కాకపోతే కొద్దిరోజులు వేచి ఉండాలని ఎంపీ చెప్పారు. ఏం జరుగుతుందో త్వరలో తేలనుంది.

పిల్లల అభిరుచులను ప్రోత్సహిస్తే చెడుదారి పట్టరు

ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్ సూచన

అక్కయ్యపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పిల్లల అభిరుచులను ప్రోత్సహిస్తే వారు మత్తు పదార్థాలు, ఇతర చెడువ్యసనాల వైపు మళ్లరని, తల్లిదండ్రులు, విద్యా సంస్థల నిర్వాహకులు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్ సూచించారు. జీతం కోసమే కాకుండా జీవితంలో అన్ని పరిస్థితులనూ ఎదుర్కొనేలా పిల్లలను పెంచాలన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న కస్టమ్స్, జీఎస్టీ నార్కొటిక్స్ జాతీయ అకాడమీ (నాసిన్)లో తల్లిదండ్రులు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని, ప్రస్తుత కాలంలో బట్టీ చదువులకు చోటే లేదన్నారు. పిల్లల్లో స్వతంత్రంగా ఆలోచించే మనస్తత్వం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెరిగేలా తల్లిదండ్రులే చొరవ తీసుకోవాలని చెప్పారు. రోజూ కొద్దిసేపైనా ఆంగ్ల దినపత్రిక చదవాలని పిల్లలకు సూచించారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. విద్యారంగంలో మార్పులు, రెగ్యులర్ స్కూళ్లకు ఉన్న ప్రత్యామ్నాయాల కోసం తల్లిదండ్రుల అవగాహన కోసం వీడియోలు సంకలనం చేశామన్నారు.

షెడ్యూల్డ్ హోదా కోసం కృషి

విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

సీతంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్‌కు అన్ని అర్హతలు ఉన్నందున రిజర్వ్ బ్యాంక్ ద్వారా షెడ్యూల్డ్ హోదా కోసం పాలకవర్గం కృషి చేస్తుందని చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. ద్వారకానగర్ అయిదోలైన్‌లోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31 నాటికి వీసీబీ రూ.71.77 కోట్ల నికర లాభం ఆర్జించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లావాదేవీల లక్ష్యం రూ.8,600 కోట్లుగా పేర్కొన్నారు. రూ.4,354.73 కోట్ల డిపాజిట్లు సేకరించగా, రూ.3,436.47 కోట్లు రుణాలు అందించినట్టు వివరించారు. సామాన్యులకు రుణాలివ్వడమే లక్ష్యంగా రూ.కోటి లోపు 95 శాతం ఇచ్చామని రాఘవేంద్రరావు తెలిపారు. నూజివీడు, తెనాలి, అమలాపురం, హైదరాబాద్, విశాఖపట్నంలో కొత్తగా బ్రాంచిలు ప్రారంభిస్తామన్నారు. ఆదివారం మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ హాలులో జరగనున్న 110వ మహాజన సభలో డివిడెండ్ ప్రకటిస్తామన్నారు. సీఈఓ వీవీబీ వనలక్ష్మి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు


సెంట్రల్ పార్కు వద్ద ముస్లింల సామూహిక ప్రార్థనలు


జాకీర్‌హుస్సేన్‌నగర్ వద్ద ముస్లింల నమాజ్

డాబాగార్డెన్స్/మహారాణిపేట/మద్రిపాలెం/మురళీనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ అంటే త్యాగానికి ప్రతీక అని హాజీ ఖాసింరజా మౌలానా అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా సెంట్రల్ పార్కు వద్ద ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాజీ ఖాసింరజా మౌలానా ఈదుల్ జుహా పండుగ బక్రీద్‌ను పురస్కరించుకుని ప్రార్థనలు నిర్వహించారు. పరస్పరం ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సర్వమానవ సమానత్వం, ప్రపంచశాంతి, సౌభ్రాతృత్వాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించామన్నారు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం అధ్యక్షుడు జనాబ్ హైదర్‌అలి సింకా మాట్లాడుతూ అన్ని పండుగలకు ప్రార్థనలు నిర్వహించేందుకు ప్రభుత్వం తమకు మంచి ప్రాంగణం ఇవ్వాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, రాష్ట్ర మైనారిటీ సెల్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ చిన్న రెహమాన్, జనరల్ సెక్రటరీ మహ్మద్ గౌస్ ప్రార్థనలు చేశారు. హాజీ ఎండీ రహంతుల్లా, ఎస్.కె.అహ్మద్‌వలీ, మహ్మద్ అస్లం పాల్గొన్నారు. వన్‌టౌన్‌లో అంబుసరంగ్ ఈద్గా మైదానంలో మసీదు అధ్యక్షుడు మహ్మద్ సుస్రత్ అలీఖాన్ నేతృత్వంలో ఇమామ్ హఫీజ్ మహ్మద్ మూతియార్ రెహ్మాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం ఖురాన్ పఠించారు. దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్‌లు ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పారు. 53వ వార్డు జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో మజీద్ ఈ అల్ ఖదీర్, మద్రిపాలెంలోని మజీద్ ఈ అల్ పత్ ఆధ్వర్యంలో ఈద్ ఉల్ అజ్హా (బక్రీద్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత మజీద్‌లలో పజర్ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు మద్రిపాలెం పరిసర ప్రాంతాల్లో శాంతి ర్యాలీ నిర్వహిస్తూ ఈద్గా వద్దకు చేరుకొని నమాజ్ ఆచరించారు. హఫీజ్ (ముస్లింల మత గురువు) హఫ్రోజ్ తక్రీర్ పఠించారు. ఈద్ నమాజ్ ఆచరించి సమాధుల వద్దకు చేరుకొని పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బక్రీద్ పండుగను మురళీనగర్ మసీదులో ఘనంగా నిర్వహించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షరీఫ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం మత గురువు ఇక్కడి మసీదు ప్రాంగణంలో చేయించిన సామూహిక ప్రార్థనల్లో వందలాది మంది పాల్గొన్నారు. బక్రీద్ పండుగ విశేషాన్ని తెలియజేస్తూ మాట్లాడారు. త్యాగ నిరతికి ప్రతీకగా ఏటా ఈ పండుగను నిర్వహిస్తామన్నారు. ఈద్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

నేడు డీఈవో కార్యాలయం ముట్టడి

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు తప్పుబట్టాయి. శనివారం తోటగరువు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గతంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపినపుడు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చి ఇప్పుడు అందుకు భిన్నంగా వెబ్ ఆధారంగా చేపడతామని ప్రకటించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి నాయకుల పిలుపుమేరకు ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడించాలని నిర్ణయించారు. ఉపాధ్యాయ సంఘ నేతలు గోపినాథ్, పైడిరాజు, వేణుగోపాల్, రామకృష్ణ, అంబేద్కర్, అరుణ్‌కుమార్, ధనుంజయ, చిన్నారావు, సూర్యనారాయణలు డీఈవో కార్యాలయానికి వెళ్లి చాంబర్‌లో బైఠాయించి నినాదాలు చేశారు. తరువాత డీఈవో ప్రేమ్‌కుమార్‌కు నోటీస్ అందజేశారు.

డిసెంబరు 31 నుంచి విశాఖలో సీఐటీయూ అఖిలభారత మహాసభలు

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను ఈ ఏడాది డిసెంబరులో నగరం వేదికగా నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలకు ఏర్పాట్లు, నిర్వహణపై 'ఆహ్వాన సంఘం' ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సమావేశమవుతుందన్నారు. ఈ సమావేశానికి ఢిల్లీ నుంచి ఎం.సాయిబాబు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావుతోపాటు రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతారన్నారు. డిసెంబరు 31 నుంచి జనవరి నాలుగు వరకూ ఐదు రోజులపాటు మహాసభలు జరుగుతాయన్నారు.

సింహగిరి కిటకిట

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపట్టారు. భక్తజనం అధిక సంఖ్యలో రావడంతో దేవస్థానం ఖజానాకు శనివారం ఒక్కరోజే సుమారు రూ.50,93,115 లక్షల ఆదాయం సమకూరినట్టు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఆదాయంలో సింహభాగం శ్రీఘ్రదర్శనం రూ.100, అతి శ్రీఘ్రదర్శనం రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ. 28,64,200 సమకూరగా, రూ.15 లడ్డూ ప్రసాదం, రూ.10 పులిహోర ప్రసాదాల అమ్మకాల ద్వారా రూ.13,72,960 ఆదాయం లభించింది. ప్రసాదాలు, దర్శనాల టికెట్లతోపాటు భక్తులు సమర్పించిన తలనీలాల టికెట్లు రూ.40 విక్రయాల ద్వారా రూ.3,98,960, విరాళాల రూపంలో రూ.2,25,008, నిత్య కల్యాణం, స్వర్ణతులసీ దళార్చన వంటి ఆర్జిత సేవల టికెట్ల అమ్మకాల ద్వారా రూ.94,480, వసతి, రవాణా విభాగాలతో కలిపి మొత్తం రూ.50,93,115 ఆదాయం సమకూరింది.

ఒరిగిన శిఖరం

... 5వ పేజీ తరువాయి

క్రమబద్ధీకరణ కోసం అరవై మందిని ఢిల్లీ తీసుకువెళ్లి పార్లమెంటు సభ్యులందరికీ లేఖలు ఇప్పించారు. దీనిపై కేంద్రం స్పందించి కార్మికులను రెగ్యులర్ చేయడంతో సింహాచలం షిప్‌యార్డులో కార్మిక నాయకుడిగా ప్రాచుర్యంలోకి వచ్చారు. షిప్‌యార్డుతో పాటు హిందూస్థాన్ జింక్, హెచ్‌పీసీఎల్ కర్మాగారాలలో జరిగిన అనేక కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన 1974లో గాజువాక సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పదేళ్లపాటు అదే పదవిలో కొనసాగారు. అదే సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వాసితుల పక్షాన పోరాటం చేశారు. ఉక్కు కర్మాగారం కోసం ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులు భూములు ఇచ్చారు. కార్మిక నాయకుడిగా, యాదవ సామాజిక వర్గ నేతగా ప్రాచుర్యం పొందిన సింహాచలం 1980లో పెందుర్తి అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు సత్యనారాయణ చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరిన సింహాచలం 1983లో విశాఖ-2 నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ఈసరపు వాసుదేవరావు చేతిలో ఓడిపోయారు. అనంతరం సింహాచలం తెలుగుదేశం పార్టీలో చేరారు. 1989లో పెందుర్తి నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి గుడివాడ గురునాథరావు చేతిలో ఓటమి చెందారు. 1994 ఎన్నికల్లో విశాఖ-2 నుంచి టీడీపీ తరపున పోటీచేసి విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో పల్లా సింహాచలానికి టికెట్ లభించలేదు. తిరిగి 2004లో విశాఖ-2 నుంచి టీడీపీ తరపున బరిలో దిగి కాంగ్రెస్ అభ్యర్థి సరిపల్లి రంగరాజు చేతిలో ఓటమి చెందారు. ఆయన వారసునిగా పల్లా శ్రీనివాసరావు రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా, గాజువాక ఎమ్మెల్యేగా ఉన్నారు. సింహాచలం అంత్యక్రియలు ఆదివారం గాజువాకలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పల్లా సింహాచలం మృతికి నేతల నివాళి

సీతంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని శనివారం సీతంపేటలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ గృహంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. స్థానికులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు సింహాచలం పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మాజీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు పల్లా సింహాచలం పార్థివ దేహానికి నమస్కరించి నివాళులర్పించారు. ఆదివారం ఉదయం సీతంపేట నుంచి గాజువాకలో గల వారి స్వగృహానికి భౌతిక కాయాన్ని తరలిస్తారు.

ఉన్నవి వదిలేసి, బయట కొనుగోలు చేసి...!

... 5వ పేజీ తరువాయి

అధికారులు మాత్రం వాటిని నిర్లక్ష్యం చేసి బయట నుంచి కొనుగోలు చేయడం విశేషం. ఒక్క కేజీహెచ్‌లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రభుత్వాస్పత్రుల్లో ఇదే విధానాన్ని అనుసరిస్తుండడం గమనార్హం. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

అధికారుల వాదన ఇదీ..

ప్రస్తుతం గాలి ద్వారా ఆక్సిజన్ తయారుచేయాలంటే భారీగా ఖర్చవుతుందని, అందులో కూడా ప్యూరిటీ తక్కువగా ఉంటుందని కేజీహెచ్ అధికారులు చెబుతున్నారు. అయితే, ప్యూరిటీ తక్కువగా ఉంటే కొవిడ్ రోగులకు ఎలా అందించారన్న ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది. ఆ ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్‌ను రోగుల అవసరాలకు వినియోగించు కోవచ్చునని, కొన్నిరకాల వ్యాధులతో బాధపడే రోగులకు లిక్విడ్ ఆక్సిజన్ కావాల్సి వస్తే బయట కొనుగోలు చేయవచ్చునని నిపుణులు సూచి స్తున్నారు. పూర్తిగా కొనుగోలు చేసిన లిక్విడ్ ఆక్సిజన్‌పై ఆధారపడి, ఆస్పత్రిలో ఉన్న ప్లాంట్లను మూలకు చేర్చడం సమంజసం కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానందను వివరణ కోరగా...ఆక్సిజన్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకువచ్చే పనిలో ఉన్నట్టు చెప్పారు. ఆక్సిజన్ ప్లాంట్ల ద్వారా తయారు చేసే ఆక్సిజన్‌తో పోలిస్తే లిక్విడ్ ఆక్సిజన్ క్వాలిటీ బాగుంటుందన్నారు. దీనిపై చాలాకాలం స్టడీ చేసిన తరువాతే కొనుగోలు చేస్తున్నామని, అయినప్పటికీ ఆక్సిజన్ ప్లాంట్లను పూర్తిగా వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు.

సప్లిమెంటరీలోనూ వెనుకంజ

... 5వ పేజీ తరువాయి

దారుణంగా పడిపోయింది. ప్రథమ సంవత్సర ఫలితాల్లో 46 శాతంతో పదో స్థానం, ద్వితీయ సంవత్సరంలో 63 శాతంతో 12వ స్థానానికి దిగజారింది. శనివారం విడుదలైన ఫలితాల ప్రకారం ప్రథమ సంవత్సర పరీక్షలకు 7,388 మంది విద్యార్థులు హాజరవ్వగా కేవలం 3,414 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఫలితంగా ఉత్తీర్ణత 46 శాతంగా నమోదైంది. వొకేషనల్ గ్రూపులకు సంబంధించి 456 మంది పరీక్షలు రాయగా 243 మంది ఉత్తీర్ణులై 53 శాతంతో రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచారు. జిల్లాలోని 154 ప్రైవేటు కళాశాలల నుంచి 6,241 మంది పరీక్షలకు హాజరవ్వగా కేవలం 48.69 శాతంతో 3,039 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ద్వితీయ సంవత్సర ఫలితాలు

జిల్లా నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 6,187 మంది హాజరవ్వగా 63 శాతంతో 3,920మంది ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్ గ్రూపుల నుంచి 361 మంది పరీక్షలు రాయగా 76 శాతంతో 274 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితంగా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచారు. కాగా 141 ప్రైవేటు కాలేజీల నుంచి 5,180 మంది పరీక్షలకు హాజరవ్వగా 65.56 శాతంతో 3,396 మంది ఉత్తీర్ణులయ్యారు. వార్షిక ఫలితాల్లో ప్రైవేటు కళాశాలలు 84 శాతం ఉత్తీర్ణత సాధించగా, సప్లిమెంటరీలో 63 శాతానికే పరిమితమయ్యాయి. దీంతో జిల్లా స్థానం రాష్ట్ర స్థాయిలో కిందకు పడిపోయింది.

తీరు మారని ప్రభుత్వ కళాశాలలు

వార్షిక ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వెనకబడడంతో రాష్ట్ర ప్రభుత్వం సప్లిమెంటరీపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. వేసవి సెలవుల్లో సైతం ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏప్రిల్ 14 నుంచి మే 10వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వార్షిక ఫలితాల్లో జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రథమ సంవత్సరంలో 34.17 శాతం, ద్వితీయ సంవత్సరంలో 55 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఫలితాలపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమావేశం నిర్వహించి జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు, ప్రిన్సిపాళ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అయినప్పటికీ సప్లిమెంటరీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు దారుణమైన ఫలితాలు సాధించాయి. 9 జూనియర్ కళాశాలల నుంచి 856 మంది పరీక్షలు రాయగా 30.49 శాతంతో 261 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 7 హైస్కూళ్ల ప్లస్ నుంచి 132 మంది పరీక్షలకు హాజరవ్వగా 21.97 శాతంతో 29 మందే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 772 మంది పరీక్షలు రాయగా 52.72 శాతంతో 407 మంది ఉత్తీర్ణులయ్యారు. 6 హైస్కూల్స్ ప్లస్ నుంచి 79 మంది పరీక్షలు రాయగా 34.18 శాతంతో 27 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ కళాశాలలు మెరుగైన ఫలితాలు సాధించాయి.

వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో
యోగాంధ్ర రేపు

సిరిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఈ నెల 9న యోగాసనాల కార్యక్రమం యోగాంధ్ర నిర్వహిస్తున్నట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. సోమవారం ఉదయం 7 నుంచి 8 వరకు బీచ్‌రోడ్డు వుడా పార్కు దరి ఎంజీఎం పార్కు లాన్‌లో జరిగే యోగాసనాల కార్యక్రమంలో నగర ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ప్రవేశం ఉచితమని ముఖ్యంగా యోగా సంస్థలకు చెందిన గురువులు, యోగాభ్యాసకులు పాల్గొనాలని కోరారు. పాల్గొనేవారు సోమవారం ఉదయం 6.30 గంటలకు చేరుకోవాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే సింహాచలం మృతికి
వీఎంఆర్డీఏ చైర్మన్ సంతాపం

సిరిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతికి వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ సంతాపం తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే , వుడా బోర్డు మాజీ సభ్యులు ఆకాల మృతి పార్టీకి తీరని లోటు అన్నారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 5 మంది
గురుకుల విద్యార్థులు ఉత్తీర్ణత

ఆరిలోవ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో ఐదుగురు విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కాగా, వారిలో ముగ్గురు ఉత్తీర్ణులు అయినట్టు గురకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 11 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో ఇద్దరు ఉత్తీర్ణులైనట్టు ఆమె తెలిపారు.

ఘనంగా
లక్ష్మీనారాయణుల కల్యాణం


కల్యాణ్యం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో లక్ష్మీనారాయణుల వార్షిక తిరుకల్యాణం శనివారం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏటా జేష్ఠ మాస శుక్లపక్ష ఏకాదశి రోజు లక్ష్మీనారాయణుల వార్షిక తిరుకల్యాణం చేయడం ఆనవాయితీ. ఉదయం గరుడ ధ్వజారోహణం జరిపారు. అనంతరం లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో శ్రీకారం చుట్టి ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు,కరి సీతారామాచార్యులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. శాస్త్ర విధానంలో కల్యాణం జరిపారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 35 దొండకాయలు 28, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)52, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 130, కీరదోస 38, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

ప్రధాని మోదీ మనకు ఆదర్శం

- ఎంపీ శ్రీభరత్
- యోగాంధ్ర కోసం గాదిరాజు ప్యాలెస్‌లో యోగా సాధన

ఎంవీపీ కాలనీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : యోగా విషయంలో మనందరికీ ప్రధాని నరేంద్ర మోదీ ఆదర్శమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో మరింత అవగాహన, చైతన్యం తెచ్చేందుకు వీలుగా ఓం ఫ్రీ యోగా సంస్థ ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శనివారం ఉదయం యోగా ప్రత్యేక ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి రోజూ రెండు గంటలు యోగా కోసం కేటాయిస్తారన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ పలు యోగాసనాలు వేశారు.

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ గిన్నీస్ రికార్డు కోసం చేస్తున్న యోగాంధ్ర కార్యక్రమం విషయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తన ఉల్లాసానికి యోగాయే కారణమన్నారు. యోగా గురువు డాక్టర్ చిలక వెంకట రమేష్ ఉచిత సేవలు ప్రశంసనీయమన్నారు.

నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు విభిన్న ఆసనాలతో ప్రత్యేక ప్రదర్శన చేశారు. దేశభక్తి గీతాలకు యోగాసనాల ప్రదర్శన ఆకట్టుకుంది. సీఎమ్మార్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ, ఆయుష్ విభాగ అధికారి ఝాన్సీ, గాదిరాజు వర్మ, విశ్వ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల ఛైర్మన్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న ఎంపీ శ్రీభరత్


యోగ సాధనలో పాల్గొన్న నగర వాసులు



యోగాసనాలు వేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, వేదికపై ఉత్తర నియోజవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, వేదికపై ఎమ్మెల్యేలు వెలగపూడి, వంశీకృష్ణ శ్రీనివాస్, పల్లా శ్రీనివాసరావు, అసోసియేషన్ సీఈవో శ్రీనివాసరావు తదితరులు

ఎంవీపీ కాలనీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎస్ 3 స్పోర్ట్స్ ఎరీనాలో షటిల్ బ్యాడ్మింటన్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ నెల పది వరకూ నిర్వహించనున్న పోటీల ప్రారంభోత్సవానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం శాశనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, దక్షణ నియోజకవర్గం శాశసనభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, అసోసియేషన్ సీఈవో శ్రీనివాసరావు, కార్పొరేటరు గొలగాని మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అమెరికన్ కార్నర్ ఆధ్వర్యంలో తీర ప్రాంత శుభ్రత


రుషికొండ తీరంలో ఏరివేసిన వ్యర్థాలతో అమెరికన్ కౌన్సిల్ జెన్నిఫర్ లార్సర్, వీసీ జీపీ రాజశేఖర్

సిరిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వలంటీర్ల సేవలు అవసరమని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులెట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. శనివారం రుషికొండ బీచ్ వద్ద ఏయూ అమెరికన్ కార్నర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ డే కార్యక్రమంలో కౌన్సిల్ జనరల్ విద్యార్థులు, వలంటీర్లతో కలిసి సాగర తీర పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, వలంటీర్లతో కలిసి బీచ్‌లో ఉన్న వ్యర్థాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడతాయన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ బీచ్ పరిసరాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. తదుపరి వలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏయూ క్రీడా విభాగ సంచాలకులు ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.హరినాథ్, ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ ఎంఎస్ యుగంధర్, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ పబ్లిక్ డిప్లొమసీ అధికారి ఎమిలియా స్మిత్, అమెరికన్ స్పేసెస్ కో-ఆర్డినేటర్ మెలిస్సానందుల, ఏయూ అమెరికన్ కార్నర్ కో-ఆర్డినేటర్ పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి వైసీపీ సర్పంచ్


సందీప్‌ను సత్కరిస్తున్న విలాస్కాన్‌పాలెం సర్పంచ్ సత్యవతి

పద్మనాభం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన విలాస్‌ఖాన్‌పాలెం పంచాయతీ సర్పంచ్ నల్లి సత్యవతి శనివారం జనసేన పార్టీలో చేరారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో తీసుకువస్తున్న సంస్కరణలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు ఆమె తెలిపారు. ఈమేరకు ఎండాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పంచకర్ల సందీప్ ఆమెకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమెతో పాటు ఆమె కుమారుడు బంగారునాయుడు కూడా జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ ఛైర్మన్ రామస్వామినాయుడు, పార్టీ బూత్ కమిటీ కన్వీనరు శ్రీనుబాబు, మూడో వార్డు అధ్యక్షుడు అక్కరమాని దివాకర్, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు వీబీ నాయుడు, అనిల్, శివ, సోమేష్ పాల్గొన్నారు.

బక్రీద్ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఆరిలోవ. జూన్7 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లిం సోదరలు శనివారం మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నమాజ్‌లు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మసీదుల్లో మత పెద్దలు ఇస్లాం బోధనలతో పాటు బక్రీద్ విశిష్టతను వివరించారు.

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని బలోపేతం చేయాలి : అజశర్మ

విశాఖపట్నం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని బలోపేతం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ అజశర్మ ఒక ప్రకటన ద్వారా భారత రాష్ట్రపతిని కోరారు. 180 మంది విద్యార్థులున్న ట్రైబల్ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది కొరతగా ఉందని, హాస్టల్ సౌకర్యంలేక తగిన వసతులులేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ యూనివర్సిటీలో 50శాతం సీట్లు గిరిజన విద్యార్థులకు నియమాలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డులో గోడలపై యోగాసనాల పెయింటింగ్స్



నగరంలో ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులో గోడలపై శనివారం రాత్రి ప్రాజెక్టర్ ద్వారా నీడ ఆధారంగా యోగాసనాల పెయింటింగ్ వేస్తున్న చిత్రకారుడు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

పెదజాలారిపేటలో ప్రమాదకరంగా
విద్యుత్ స్తంభాలు

- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు


కింది భాగంలో తుప్పు పట్టి పాడైన విద్యుత్ స్తంభం

పెదవాల్తేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు వాల్తేరు డిపో పెదజాలారిపేట వద్ద గల ప్రధాన కూడలి చేపల మార్కెట్, ప్రజా ఆరోగ్య కేంద్రం (గీతం హాస్పిటల్) దేవాలయాలు వద్ద హైమాస్ట్ విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ ఉన్న ప్రజా ఆరోగ్య కేంద్ర, చేపల మార్కెట్, దేవాలయాలకు పెదజాలరిపేట, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. దీంతో ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అయితే తప్పు పట్టిన ఈ విద్యుత్ స్తంభాలు ఎప్పుడు పడిపోతాయో అన్నట్టుగా ఉండడంతో అంతా ఆందోళన చెందుతున్నారు.

అలాగే కొద్ది నెలల నుంచి హైమాస్ట్ లైట్స్ వెలగడం లేదని, చీకటి పడితే అంధకారం నెలకొని ఉండడంతో ఈ ప్రాంతంలో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో రాత్రి బైటకు రావడానికే భయమేస్తోందని మహిళలు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడకి ఎలక్ట్రికల్ సిబ్బంది వచ్చినా కింది భాగంలో పూర్తిగా తుప్పు పట్టి ఉండడంతో స్తంభం ఎక్కి లైట్లు వేయడానికి భయపడుతున్నారు.

దీంతో ఆరు నెలలుగా ఇక్కడ రాత్రి వేళల్లో దీపాలు వెలగక అంధ కారం నెలకొంటోంది. ఇప్పటికైనా ఉన్న తాధికారులు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకొని వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రధాన కూడలిలో కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

విశాఖ అభివృద్ధిపై సీఎం వ్యాఖ్యలు భేష్

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర


మాట్లాడుతున్న రవీంద్ర

పెదవాల్తేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖను ఆర్థిక శక్తిగా ముందుకు తీసుకొని వెళ్తామని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొనడం పట్ల బీజేపీ విశాఖ మాజీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. అందుకు అపారమైన అవకాశాలు కూడా విశాఖలో ఉన్నాయి అని గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విశాఖ అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. గత ప్రభుత్వం విశాఖలో ప్రభుత్వ స్థలాలను, కట్టడాలను తాకట్టు పెట్టి కోట్ల రూపాయిలు దుర్వినియోగం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా విశాఖ ప్రజలలో అభివృద్ధి పట్ల ఆశలు చిగురిచాయని తెలిపారు. అయితే రాష్ట్రంలోనే అతి పెద్ద నగరం విశాఖ కార్పొరేషన్‌కు గత కొంత కాలంగా కమీషనర్ లేకపోవడం పట్ల నిస్మయ్యం వ్యక్తం చేసారు. అలాగే రాష్ట్ర ఆహార పరీక్ష కేంద్రాన్ని పూర్తి స్థాయిలో నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని సాక్షాత్తు ప్రధాని గత సంవత్సరం ఫిబ్రవరిలో ప్రారంభించిన పరీక్ష కేంద్రాన్ని ఇంత వరకు వాడుకలోకి తేవకపోవడం పట్ల స్థానికులు విస్మయ్యం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ రోజు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం దృష్ట పెట్టి ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ రాక సమయానికి పూర్తి చేయ్యాలని కోరారు.

పాలనాపరమైన కారణం చూపుతూ బదిలీలు

- ఖజానా శాఖలో ఉన్నతాధికారుల లీలలు

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఖజానా శాఖలో చేపట్టిన బదిలీల్లో ఉన్నతాధికారులు లీలలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ శాఖలలో బదిలీలకు సంబంధించి జారీ చేసిన జీవో నంబరు 30కు విరుద్ధంగా ఖజానాలో బదిలీలు చేశారని ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. పాలనాపరమైన సౌలభ్యం పేరిట బదిలీల విషయంలో పేర్కొన్న అంశానికి భిన్నంగా పలువురు ఉద్యోగులను విశాఖ, పాడేరు జిల్లా ఖజానా కార్యాలయాల నుంచి సీతమధారలోని సబ్‌ట్రెజరీకి బదిలీ చేశారు. 'పాలనా సౌలభ్యం' పేరిట అనే పదం చేర్చి బదిలీ చేశారని ఆరోపిస్తున్నారు.

ఏజెన్సీలో ఏళ్ల తరబడి పని చేసిన వారి ప్రాధాన్యత పట్టించుకోకుండా బదిలీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీలల్లో పారదర్శకత లేకుండా ఉన్నతాధికారులు తమకు అనుకూలంగా ఉండే వర్గానికి పెద్ద పీట వేశారనే అంటున్నారు. ఖజానా కార్యాలయంలో బదిలీలల్లో ఉన్నతాధికారులు నిర్వాకంపై జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలను కలిసి విన్నవించాలని పలువురు ఉద్యోగులు నిర్ణయించారు.

కమనీయం.. స్వాముల కల్యాణోత్సవం



రమా సత్యనారాయణ స్వాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు



వేంకటేశ్వరస్వామికి పల్లకి సేవ



అంబికాబాగ్‌లో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

మహారాణిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు తీరంలోని శృంగమణి పర్వతంపై వెలసిన వెంకటేశ్వరస్వామి, ఇసుకకొండపై రమా సత్యనారాయణస్వాముల తిరు కల్యాణ మహోత్సవాలు, అంబికా బాగ్‌లోని రామాలయంలో సీతారాముల వార్షిక కల్యాణోత్సవాలు శనివారం కమనీయంగా జరిగాయి. వన్‌టౌన్‌లోని పోర్టు ఏరియాలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 6న ప్రారంభమైన కల్యాణోత్సవాలు 12 వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం పెద్దఎత్తున విచ్చేసిన భక్తుల సమక్షంలో కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా జరిపించారు. ఆదివారం తిరు వీధులలో గరుడవాహన సేవ నిర్వహిస్తారు. 10న సాయంత్రం సాగర జలాల్లో పైలెట్ లాంచి పై తెప్పోత్సవం జరుగుతుంది. 12న పుష్పాంజలి సేవ జరిగాక, 22న 16 రోజుల పండుగ పాలి కా విసర్జనంతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ఈవో ఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తుల సమక్షంలో వేద పండితులు స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ నెల 5న ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేనుల పూజతో అంకురార్పణ చేసి అగ్ని ప్రతిష్ఠాపన హోమాలు నిర్వహించారు. శుక్రవారం ఏకాదశి పర్వదినాన ధ్వజారోహణం జరిగింది. 11న జ్యేష్ఠ పౌర్ణమి వేడుకలు, 12న పుష్పయాగం, పవళింపు సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ఈవో టి.రాజగోపాల రెడి తెలిపారు.

మహారాణిపేటలోని అంబికాబాగ్ రామాలయంలో సీతారామ చంద్రమూర్తి వార్షిక కల్యాణ మహోత్సవాలు భక్తిపారవశ్యంతో నిర్వహించారు. వేకువజాము నుంచే వేద పండితుల ఆధ్వర్యంలో సీతారాములుకు ప్రత్యేక పూజలు జరిపించి అనంతరం కల్యాణ వేడుకలు నిర్వహించారు. మూడు ప్రాంతాలకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి వేడుకలను తిలకించారు. అనంతరం స్వామి వార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంగన్‌వాడీల హామీల అమలుకు డిమాండ్

మహారాణిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీఐటీయూ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ వర్కర్సు యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా కూటమి పార్టీలు అనేక హామీలిచ్చారని, అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పిస్తామని వాగ్దానాలు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అధికారం చేపట్టి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కావడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. జులై 9న జరిగే అఖిలభారత సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొంటారని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ సిబ్బందికి వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్ ఈశ్వరమ్మ, అధ్యక్షురాలిగా శోభారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శిగా తులసి, ఇతర కార్యవర్గాన్ని ప్రకటించారు.

స్పెషల్‌బ్రాంచిలో చక్రం తిప్పుతున్న సీఐ

... 5వ పేజీ తరువాయి

పెడుతుంటారని, కొద్దిరోజుల కిందటివరకు పోర్టుకు వచ్చే విదేశీయులకు తాత్కాలిక వీసాల జారీకి తనకు లేని అధికారాన్ని చలాయించి ఏజెంట్ల నుంచి వసూళ్లకు పాల్పడ్డారని సిబ్బందే ఆరోపిస్తున్నారు. దీనిపై సీపీకి సమాచారం ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదనే అభిప్రాయం ఉంది. అలాగే విదేశీ పౌరసత్వం కలిగిన ఒక ఎన్ఆర్ఐ కుటుంబం ఇటీవల నగరానికి రాగా, తాత్కాలిక వీసా కోసం ఆయన డబ్బులు డిమాండ్ చేసినట్టు ఎంబసీ ద్వారా సీపీకి ఈ-మెయిల్‌లో ఫిర్యాదు అందినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. దీనిపై సీపీ చర్యలు తీసుకుంటారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలను నాలుగు రోజుల క్రితం అంతర్గతంగా బదిలీ చేసిన సీపీ...ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి స్పెషల్‌బ్రాంచిలోనే కీలకమైన బాధ్యతలు అప్పగించడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అసలు స్పెషల్ బ్రాంచిలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని అధికారులు, సిబ్బంది అంటున్నారు. ఉన్నతాధికారులను సదరు అధికారి ప్రసన్నం చేసుకున్నారని, అందుకే అతని వ్యవహారాలను సీపీ దృష్టికి చేరకుండా వారంతా కాపాడడమే కాకుండా ఇతర అధికారులపై నెట్టేస్తున్నారని స్పెషల్ బ్రాంచి అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి తొలగిన అడ్డంకులు

... 5వ పేజీ తరువాయి

(డీపీఆర్) తయారుచేశారు. ప్రస్తుతం ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండగా వాటిని ఇంకో రెండు పెంచి పది చేయాలని అనుకున్నారు. వాటి కోసం జ్ఞానాపురం వైపు చెట్లను తొలగించి పనులు కూడా చేపట్టారు. అయితే కొత్త డీపీఆర్‌లో ఇంకో నాలుగు ప్లాట్‌ఫారాలు పెంచి మొత్తం 14 చేయాలని నిర్ణయించారు. మరికొన్ని అదనపు పనులు కూడా చేర్చారు. ఈ డీపీఆర్‌ను ఢిల్లీకి పంపించారు. దానికి ఆమోదం లభించాల్సి ఉంది. అక్కడ అంగీకారం లభించగానే అక్టోబరులో పనులు ప్రారంభించి, అక్కడి నుంచి 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

2027 మేకు పూర్తి

రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు 2027 మే నాటికి పూర్తయిపోతాయని విశ్వాసం ఉంది. ఇప్పుడు మంచి సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. డీపీఆర్ ఆమోదించగానే పనులు మొదలవుతాయి. చాలా వేగంగా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

-ఎంపీ భరత్

కేజీహెచ్‌లో మెరుగైన సదుపాయాలు: వంశీకృష్ణ



రోగుల నిరీక్షణ గది ప్రారంభిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీపీ బాగ్చి, చిత్రంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తదితరులు

మహారాణిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో మెరుగైన సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేయనున్నట్లు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం కేజీహెచ్‌లో పోలీసు అవుట్ పోస్టు, టెస్లా సెంటర్ వద్ద రోగుల నిరీక్షణ ప్రాంతంలో పలుషెడ్లను ఎమ్మెల్యే వంశీకృష్ణ, పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కేజీహెచ్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దటంలో స్థానిక వైద్య సిబ్బంది కృషిని అభినందించారు. రోగులు, వారి కుటుంబ సభ్యులకు నిరంతరం మెరుగైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెడెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్య అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీతంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం అర్జీదారులకు అందజేశారు. 37వ వార్డుకు చెందిన ఎస్.దానియమ్మ, 34వ వార్డుకు చెందిన ఎస్.అప్పలరాజుకు రూ.50 వేల వంతున, 38వ వార్డుకు చెందిన మున్నం చంద్రమౌళికి రూ.94,345 చెక్కులను ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్‌లు అందజేశారు. కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు.

10న సీఎం రాక

... 5వ పేజీ తరువాయి

సమీక్షిస్తారు. సీఎం పర్యటనకు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్ రావలసి ఉంది. ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడ నుంచి రోడ్డు మార్గాన పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళతారు. ఆరోజు రాత్రి నగరానికి చేరుకుని టీడీపీ కార్యాలయంలో బస చేస్తారు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి విజయవాడ వెళతారు.

ఏయూలో అక్రమాలపై విచారణ

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. ప్రభుత్వం మారగానే ప్రసాదరెడ్డిపై చర్యలు తీసుకుంటుందని అంతా భావించారు. ఏదో ఒకటి చేస్తారని ఆయన కూడా కొన్నాళ్లు సెలవు పెట్టి వెళ్లిపోయారు. క్యాంపస్ నిండా తన మనుషులే కాబట్టి విచారణ చేపట్టినా ఏమీ కాదని భావించారు. మళ్లీ విధుల్లో చేరారు. అయితే మూడు నెలల కిందట అసెంబ్లీలో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు వంటి వారంతా ప్రసాదరెడ్డి వ్యవహారాన్ని ప్రస్తావించారు. దీంతో అసెంబ్లీ వేదికగా మంత్రి నారా లోకేష్ స్పందించారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విజిలెన్స్ విచారణ పూర్తిచేసి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అయితే, ఇప్పటివరకూ విజిలెన్స్ విచారణ చేపట్టలేదని అంతా భావిస్తున్నారు. కానీ విచారణ జరుగుతోందని, చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామని ఎంపీ శ్రీభరత్ శనివారం స్పష్టంచేశారు. ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ కొత్త వారితో టీమ్ ఏర్పాటు చేసుకున్నారని, కొత్తపాలన మొదలవుతుందన్నారు. ఏదీ కక్ష సాధింపుతో చేయబోమని, చట్టప్రకారమే కచ్చితంగా చర్యలు ఉంటాయని, కాకపోతే కొద్దిరోజులు వేచి ఉండాలని ఎంపీ చెప్పారు. ఏం జరుగుతుందో త్వరలో తేలనుంది.

పిల్లల అభిరుచులను ప్రోత్సహిస్తే చెడుదారి పట్టరు

ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్ సూచన

అక్కయ్యపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పిల్లల అభిరుచులను ప్రోత్సహిస్తే వారు మత్తు పదార్థాలు, ఇతర చెడువ్యసనాల వైపు మళ్లరని, తల్లిదండ్రులు, విద్యా సంస్థల నిర్వాహకులు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్ సూచించారు. జీతం కోసమే కాకుండా జీవితంలో అన్ని పరిస్థితులనూ ఎదుర్కొనేలా పిల్లలను పెంచాలన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న కస్టమ్స్, జీఎస్టీ నార్కోటిక్స్ జాతీయ అకాడమీ (నాసిన్)లో తల్లిదండ్రులు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని, ప్రస్తుత కాలంలో బట్టీ చదువులకు చోటే లేదన్నారు. పిల్లల్లో స్వతంత్రంగా ఆలోచించే మనస్తత్వం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెరిగేలా తల్లిదండ్రులే చొరవ తీసుకోవాలని చెప్పారు. రోజూ కొద్దిసేపైనా ఆంగ్ల దినపత్రిక చదవాలని పిల్లలకు సూచించారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. విద్యారంగంలో మార్పులు, రెగ్యులర్ స్కూళ్లకు ఉన్న ప్రత్యామ్నాయాల కోసం తల్లిదండ్రుల అవగాహన కోసం వీడియోలు సంకలనం చేశామన్నారు.

షెడ్యూల్డ్ హోదా కోసం కృషి

విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

సీతంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్‌కు అన్ని అర్హతలు ఉన్నందున రిజర్వ్ బ్యాంక్ ద్వారా షెడ్యూల్డ్ హోదా కోసం పాలకవర్గం కృషి చేస్తుందని చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. ద్వారకానగర్ అయిదోలైన్‌లోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31 నాటికి వీసీబీ రూ.71.77 కోట్ల నికర లాభం ఆర్జించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లావాదేవీల లక్ష్యం రూ.8,600 కోట్లుగా పేర్కొన్నారు. రూ.4,354.73 కోట్ల డిపాజిట్లు సేకరించగా, రూ.3,436.47 కోట్లు రుణాలు అందించినట్లు వివరించారు. సామాన్యులకు రుణాలివ్వడమే లక్ష్యంగా రూ.కోటి లోపు 95 శాతం ఇచ్చామని రాఘవేంద్రరావు తెలిపారు. నూజివీడు, తెనాలి, అమలాపురం, హైదరాబాద్, విశాఖపట్నంలో కొత్తగా బ్రాంచిలు ప్రారంభిస్తామన్నారు. ఆదివారం మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ హాలులో జరగనున్న 110వ మహాజన సభలో డివిడెండ్ ప్రకటిస్తామన్నారు. సీఈఓ వీవీబీ వనలక్ష్మి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



సెంట్రల్ పార్కు వద్ద ముస్లింల సామూహిక ప్రార్థనలు



జాకీర్‌హుస్సేన్‌నగర్ వద్ద ముస్లింల నమాజ్

డాబాగార్డెన్స్/మహారాణిపేట/మర్రిపాలెం/మురళీనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ అంటే త్యాగానికి ప్రతీక అని హాజీ ఖాసింరజా మౌలానా అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా సెంట్రల్ పార్కు వద్ద ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాజీ ఖాసింరజా మౌలానా ఈదుల్ జుహా పండుగ బక్రీద్‌ను పురస్కరించుకుని ప్రార్థనలు నిర్వహించారు. పరస్పరం ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సర్వమానవ సమానత్వం, ప్రపంచశాంతి, సౌభ్రాతృత్వాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించామన్నారు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం అధ్యక్షుడు జనాబ్ హైదర్‌అలి సింకా మాట్లాడుతూ అన్ని పండుగలకు ప్రార్థనలు నిర్వహించేందుకు ప్రభుత్వం తమకు మంచి ప్రాంగణం ఇవ్వాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, రాష్ట్ర మైనారిటీ సెల్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ చిన్న రెహమాన్, జనరల్ సెక్రటరీ మహ్మద్ గౌస్ ప్రార్థనలు చేశారు. హాజీ ఎండీ రహంతుల్లా, ఎస్.కె.అహ్మద్‌వలీ, మహ్మద్ అస్లం పాల్గొన్నారు. వన్‌టౌన్‌లో అంబుసరంగ్ ఈద్గా మైదానంలో మసీదు అధ్యక్షుడు మహ్మద్ సుసత్ అలీఖాన్ నేతృత్వంలో ఇమామ్ హఫీజ్ మహ్మద్ మూతియార్ రెహ్మాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం ఖురాన్ పఠించారు. దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్‌లు ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పారు. 53వ వార్డు జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో మజీద్ ఈ అల్ ఖదీర్, మర్రిపాలెంలోని మజీద్ ఈ అల్ పత్ ఆధ్వర్యంలో ఈద్ ఉల్ ఆజ్హా (బక్రీద్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత మజీద్‌లలో పజర్ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో శాంతి ర్యాలీ నిర్వహిస్తూ ఈద్గా వద్దకు చేరుకొని నమాజ్ ఆచరించారు. హఫీజ్ (ముస్లింల మత గురువు) హఫ్రోజ్ తక్రీర్ పఠించారు. ఈద్ నమాజ్ ఆచరించి సమాధుల వద్దకు చేరుకొని పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బక్రీద్ పండుగను మురళీనగర్ మసీదులో ఘనంగా నిర్వహించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షరీఫ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం మత గురువు ఇక్కడి మసీదు ప్రాంగణంలో చేయించిన సామూహిక ప్రార్థనల్లో వందలాది మంది పాల్గొన్నారు. బక్రీద్ పండుగ విశేషాన్ని తెలియజేస్తూ మాట్లాడారు. త్యాగ నిరతికి ప్రతీకగా ఏటా ఈ పండుగను నిర్వహిస్తామన్నారు. ఈద్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

నేడు డీఈవో కార్యాలయం ముట్టడి

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు తప్పుబట్టాయి. శనివారం తోటగరువు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గతంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపినపుడు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చి ఇప్పుడు అందుకు భిన్నంగా వెబ్ ఆధారంగా చేపడతామని ప్రకటించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి నాయకుల పిలుపుమేరకు ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడించాలని నిర్ణయించారు. ఉపాధ్యాయ సంఘ నేతలు గోపినాథ్, పైడిరాజు, వేణుగోపాల్, రామకృష్ణ, అంబేడ్కర్, అరుణ్‌కుమార్, ధనుంజయ, చిన్నారావు, సూర్యనారాయణలు డీఈవో కార్యాలయానికి వెళ్లి చాంబర్‌లో బైఠాయించి నినాదాలు చేశారు. తరువాత డీఈవో ప్రేమ్‌కుమార్‌కు నోటీస్ అందజేశారు.

డిసెంబరు 31 నుంచి విశాఖలో సీఐటీయూ అఖిలభారత మహాసభలు

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను ఈ ఏడాది డిసెంబరులో నగరం వేదికగా నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలకు ఏర్పాట్లు, నిర్వహణపై 'ఆహ్వాన సంఘం' ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సమావేశమవుతుందన్నారు. ఈ సమావేశానికి ఢిల్లీ నుంచి ఎం.సాయిబాబు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావుతోపాటు రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతారన్నారు. డిసెంబరు 31 నుంచి జనవరి నాలుగు వరకూ ఐదు రోజులపాటు మహాసభలు జరుగుతాయన్నారు.

సింహగిరి కిటకిట

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపట్టారు. భక్తజనం అధిక సంఖ్యలో రావడంతో దేవస్థానం ఖజానాకు శనివారం ఒక్కరోజే సుమారు రూ.50,93,115 లక్షల ఆదాయం సమకూరినట్టు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఆదాయంలో సింహభాగం శ్రీఘ్రదర్శనం రూ.100, అతి శ్రీఘ్రదర్శనం రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ. 28,64,200 సమకూరగా, రూ.15 లడ్డూ ప్రసాదం, రూ.10 పులిహోర ప్రసాదాల అమ్మకాల ద్వారా రూ.13,72,960 ఆదాయం లభించింది. ప్రసాదాలు, దర్శనాల టికెట్లతోపాటు భక్తులు సమర్పించిన తలనీలాల టికెట్లు రూ.40 విక్రయాల ద్వారా రూ.3,98,960, విరాళాల రూపంలో రూ.2,25,008, నిత్య కల్యాణం, స్వర్ణతులసీ దళార్చన వంటి ఆర్జిత సేవల టికెట్ల అమ్మకాల ద్వారా రూ.94,480, వసతి, రవాణా విభాగాలతో కలిపి మొత్తం రూ.50,93,115 ఆదాయం సమకూరింది.

ఒరిగిన శిఖరం

... 5వ పేజీ తరువాయి

క్రమబద్ధీకరణ కోసం అరవై మందిని ఢిల్లీ తీసుకువెళ్లి పార్లమెంటు సభ్యులందరికీ లేఖలు ఇప్పించారు. దీనిపై కేంద్రం స్పందించి కార్మికులను రెగ్యులర్ చేయడంతో సింహాచలం షిప్‌యార్డులో కార్మిక నాయకుడిగా ప్రాచుర్యంలోకి వచ్చారు. షిప్‌యార్డుతో పాటు హిందూస్థాన్ జింక్, హెచ్‌పీసీఎల్ కర్మాగారాలలో జరిగిన అనేక కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన 1974లో గాజువాక సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పదేళ్లపాటు అదే పదవిలో కొనసాగారు. అదే సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వాసితుల పక్షాన పోరాటం చేశారు. ఉక్కు కర్మాగారం కోసం ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులు భూములు ఇచ్చారు. కార్మిక నాయకుడిగా, యాదవ సామాజిక వర్గ నేతగా ప్రాచుర్యం పొందిన సింహాచలం 1980లో పెందుర్తి అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు సత్యనారాయణ చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరిన సింహాచలం 1983లో విశాఖ-2 నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ఈసరపు వాసుదేవరావు చేతిలో ఓడిపోయారు. అనంతరం సింహాచలం తెలుగుదేశం పార్టీలో చేరారు. 1989లో పెందుర్తి నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి గుడివాడ గురునాథరావు చేతిలో ఓటమి చెందారు. 1994 ఎన్నికల్లో విశాఖ-2 నుంచి టీడీపీ తరపున పోటీచేసి విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో పల్లా సింహాచలానికి టికెట్ లభించలేదు. తిరిగి 2004లో విశాఖ-2 నుంచి టీడీపీ తరపున బరిలో దిగి కాంగ్రెస్ అభ్యర్థి సరిపల్లి రంగరాజు చేతిలో ఓటమి చెందారు. ఆయన వారసునిగా పల్లా శ్రీనివాసరావు రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా, గాజువాక ఎమ్మెల్యేగా ఉన్నారు. సింహాచలం అంత్యక్రియలు ఆదివారం గాజువాకలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పల్లా సింహాచలం మృతికి నేతల నివాళి

సీతంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని శనివారం సీతంపేటలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ గృహంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. స్థానికులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు సింహాచలం పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మాజీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు పల్లా సింహాచలం పార్థివ దేహానికి నమస్కరించి నివాళులర్పించారు. ఆదివారం ఉదయం సీతంపేట నుంచి గాజువాకలో గల వారి స్వగృహానికి భౌతిక కాయాన్ని తరలిస్తారు.

ఉన్నవి వదిలేసి, బయట కొనుగోలు చేసి...!

... 5వ పేజీ తరువాయి

అధికారులు మాత్రం వాటిని నిర్లక్ష్యం చేసి బయట నుంచి కొనుగోలు చేయడం విశేషం. ఒక్క కేజీహెచ్‌లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రభుత్వాస్పత్రుల్లో ఇదే విధానాన్ని అనుసరిస్తుండడం గమనార్హం. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

అధికారుల వాదన ఇదీ..

ప్రస్తుతం గాలి ద్వారా ఆక్సిజన్ తయారుచేయాలంటే భారీగా ఖర్చవుతుందని, అందులో కూడా ప్యూరిటీ తక్కువగా ఉంటుందని కేజీహెచ్ అధికారులు చెబుతున్నారు. అయితే, ప్యూరిటీ తక్కువగా ఉంటే కొవిడ్ రోగులకు ఎలా అందించారన్న ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది. ఆ ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్‌ను రోగుల అవసరాలకు వినియోగించు కోవచ్చునని, కొన్నిరకాల వ్యాధులతో బాధపడే రోగులకు లిక్విడ్ ఆక్సిజన్ కావాల్సి వస్తే బయట కొనుగోలు చేయవచ్చునని నిపుణులు సూచి స్తున్నారు. పూర్తిగా కొనుగోలు చేసిన లిక్విడ్ ఆక్సిజన్‌పై ఆధారపడి, ఆస్పత్రిలో ఉన్న ప్లాంట్లను మూలకు చేర్చడం సమంజసం కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానందను వివరణ కోరగా...ఆక్సిజన్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకువచ్చే పనిలో ఉన్నట్టు చెప్పారు. ఆక్సిజన్ ప్లాంట్ల ద్వారా తయారు చేసే ఆక్సిజన్‌తో పోలిస్తే లిక్విడ్ ఆక్సిజన్ క్వాలిటీ బాగుంటుందన్నారు. దీనిపై చాలాకాలం స్టడీ చేసిన తరువాతే కొనుగోలు చేస్తున్నామని, అయినప్పటికీ ఆక్సిజన్ ప్లాంట్లను పూర్తిగా వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు.

సప్లిమెంటరీలోనూ వెనుకంజ

... 5వ పేజీ తరువాయి

దారుణంగా పడిపోయింది. ప్రథమ సంవత్సర ఫలితాల్లో 46 శాతంతో పదో స్థానం, ద్వితీయ సంవత్సరంలో 63 శాతంతో 12వ స్థానానికి దిగజారింది. శనివారం విడుదలైన ఫలితాల ప్రకారం ప్రథమ సంవత్సర పరీక్షలకు 7,388 మంది విద్యార్థులు హాజరవ్వగా కేవలం 3,414 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఫలితంగా ఉత్తీర్ణత 46 శాతంగా నమోదైంది. వొకేషనల్ గ్రూపులకు సంబంధించి 456 మంది పరీక్షలు రాయగా 243 మంది ఉత్తీర్ణులై 53 శాతంతో రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచారు. జిల్లాలోని 154 ప్రైవేటు కళాశాలల నుంచి 6,241 మంది పరీక్షలకు హాజరవ్వగా కేవలం 48.69 శాతంతో 3,039 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ద్వితీయ సంవత్సర ఫలితాలు

జిల్లా నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 6,187 మంది హాజరవ్వగా 63 శాతంతో 3,920మంది ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్ గ్రూపుల నుంచి 361 మంది పరీక్షలు రాయగా 76 శాతంతో 274 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితంగా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచారు. కాగా 141 ప్రైవేటు కాలేజీల నుంచి 5,180 మంది పరీక్షలకు హాజరవ్వగా 65.56 శాతంతో 3,396 మంది ఉత్తీర్ణులయ్యారు. వార్షిక ఫలితాల్లో ప్రైవేటు కళాశాలలు 84 శాతం ఉత్తీర్ణత సాధించగా, సప్లిమెంటరీలో 63 శాతానికే పరిమితమయ్యాయి. దీంతో జిల్లా స్థానం రాష్ట్ర స్థాయిలో కిందకు పడిపోయింది.

తీరు మారని ప్రభుత్వ కళాశాలలు

వార్షిక ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వెనకబడడంతో రాష్ట్ర ప్రభుత్వం సప్లిమెంటరీపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. వేసవి సెలవుల్లో సైతం ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏప్రిల్ 14 నుంచి మే 10వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వార్షిక ఫలితాల్లో జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రథమ సంవత్సరంలో 34.17 శాతం, ద్వితీయ సంవత్సరంలో 55 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఫలితాలపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమావేశం నిర్వహించి జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు, ప్రిన్సిపాళ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అయినప్పటికీ సప్లిమెంటరీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు దారుణమైన ఫలితాలు సాధించాయి. 9 జూనియర్ కళాశాలల నుంచి 856 మంది పరీక్షలు రాయగా 30.49 శాతంతో 261 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 7 హైస్కూళ్ల ప్లస్ నుంచి 132 మంది పరీక్షలకు హాజరవ్వగా 21.97 శాతంతో 29 మందే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 772 మంది పరీక్షలు రాయగా 52.72 శాతంతో 407 మంది ఉత్తీర్ణులయ్యారు. 6 హైస్కూల్స్ ప్లస్ నుంచి 79 మంది పరీక్షలు రాయగా 34.18 శాతంతో 27 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ కళాశాలలు మెరుగైన ఫలితాలు సాధించాయి.

అశోక్‌నగర్‌లో దాహం దాహం..

- కొళాయిల ద్వారా పూర్తి స్థాయిలో సరఫరా కానీ తాగునీరు
- పైపు లైన్లకు లీకేజీలే కారణం
- మూడేళ్లయినా అమలుకు నోచుకోని కార్పొరేటర్ బొడ్డు నరసింహప్రాతుడి హామీ
- నీటి కోసం నానాపాట్లు పడుతున్న ప్రజలు



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు, చిన్నపాటి ధారలా కొళాయిల వస్తున్న నీరు

పెదగంట్యాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్ కాలనీకి నీటి సరఫరా సరిగ్గా జరగ్గా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండు వేసవిలో తగినంత నీరు లభించక దాహం కేకలతో అల్లాడుతున్నారు. కాలనీలోని ఇళ్లకు సరఫరా కావాల్సిన నీరు పైపు లైన్ల లీకేజీల మూలంగా వృథాగా పారుతూ కాలువల్లో కలుస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా తక్కువ మొత్తంలో నీరు కొళాయిల ద్వారా దిగువ ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లకు మాత్రమే సరఫరా అవుతుందని, దీంతో తాగునీటికి, నిత్యావసరాల కోసం నానాపాట్లు పడుతున్నామని చెబుతున్నారు. వార్డు పరిధిలోని గిరిజా కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా కొండవాలు ప్రాంతంలో ఉన్న ట్యాంకు నుంచి అశోక్‌నగర్ కాలనీకి పైపు లైన్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. అయితే జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో, అశోక్‌నగర్ పదో నంబర్ రోడ్డులో పైపు లైన్లకు లీకేజీలు ఏర్పడడంతో అధిక మొత్తంలో నీరు డ్రైనేజీల్లో కలుస్తుంది. ఈ కారణంగా కాలనీలోని 1, 2, 3 మూడు వీధుల్లోని ఐదారు ఇళ్లకు మాత్రమే కొళాయిల ద్వారా నీరు వస్తుండగా, మిగిలిన ఇళ్లకు సరఫరా కావడం లేదు. మిగిలిన ఎనిమిది వీధుల్లోనూ సగం ఇళ్లకే నీటి సరఫరా అవుతుంది. అదికూడా చిన్నపాటి ధారలా తక్కువగా మోతాదులో నీరు వస్తుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

అమలుకు నోచుకోని కార్పొరేటర్ హామీ

ఈ సమస్యను స్థానికులు పలుమార్లు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. నూతనంగా పైపు లైన్లు వేసి కాలనీకి పూర్తి స్థాయిలో నీరందిస్తామని ఆయన హామీ ఇచ్చి మూడు సంవత్సరాలైనా ఇప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం దారుణమని పలువురు మండిపడుతున్నారు. కాలనీలో 60 శాతం నివాసితులను తాగునీటి సమస్య వెంటాడుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



గాజువాక : శాంతి ర్యాలీ చేస్తున్న ముస్లింలు



కూర్మన్నపాలెం : కుంచుమాంబ కాలనీ మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



కొత్తపాలెం గ్రామంలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

గాజువాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో బక్రీద్ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలుగాజువాక అజీమాబాద్ సున్నిజామా మసీదు నుంచి కణితి రోడ్డు మదీనా మసీదు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. మసీదులో ప్రార్థనలు చేశారు. వేడుకల్లో మాజీ కార్పొరేటర్ ఎం.డీ.రఫీ, మత పెద్దలు వల్లి, మదీనా, రిజ్వాన్, షాకత్ ఆలీ, రజీవుల్లా, రెహ్మాన్, ఇమ్రాన్, ఇషాక్ పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో..

ఆటోనగర్: జీవీఎంసీ 70, 71 వార్డుల పరిధిలోని ఆటోనగర్, కుంచుమాంబ కాలనీ, ఎల్వీ నగర్ మసీదుల్లో శనివారం బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మత పెద్దలు పాల్గొని త్యాగనిరతికి, నిస్వార్థ సేవా గుణానికి ప్రతీక బక్రీద్ అని ప్రత్యేక సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ 70వ వార్డు టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు రహ్మాన్ మాట్లాడుతూ అల్లాపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ, భక్తిశ్రద్ధలతో ఈద్గాలో సామూహికంగా ప్రార్థనలు చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకోవటం ముస్లింల ఐక్యతలను చాటుతుందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ ఆష్రఫ్, అబ్దుల్‌సత్తార్, బాబ్జీ, మదీనా, మహ్మద్, నూర్ బాషా, సుబాన్, మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు ఫకీరు తక్యాలో, 87వ వార్డు వడ్లపూడిలో శనివారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో

గోపాలపట్నం : బక్రీద్ పండుగ సందర్భంగా గోపాలపట్నంలో పలు మసీదుల్లో శనివారం ముస్లింసోదరులు నమాజ్‌చేశారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు బక్రీద్ ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక కొత్తపాలెం గ్రామంలోని మసీద్ నూరానియా కమిటీ సభ్యులు గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు.

పెందుర్తిలో

పెందుర్తి: చినముషిడివాడ మజీద్ ఏ నూరానిలో బక్రీద్ పండుగ ప్రెసిడెంట్ షేక్ బ్రుహాన్ ఆధ్వర్యంలో కనుల విందుగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇబ్రహిం దేవుడు ఆదేశం మేరకు హజరత్ ఇబ్రహిం తన కుమారిడిని ఖుర్బానీ ఇవ్వడానికి కూడా వెనకాడ లేదని కొనియాడారు. ఈరోజు నుంచి ప్రళయం దినం వరకు కుర్బానీ పాటించాలని ముస్లిం సోదరులకు వివరించారు. ఖుర్బానీ పాటించడానికి తాను సిద్ధమని చీఫ్ ఆర్గనైజర్ బాబూలాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన పి. గణబాబు




కార్యకర్త శ్రీనును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గణబాబు తదితరులు

కంచరపాలెం,(ఆర్పీపేట),జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 57వార్డు ఆశవానిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ బూత్ కమిటీ నాయకుడు ఎ.శ్రీనివాసరావుకు ఇటీవలే కాలుకు ఆపరేషన్ జరిగింది. ఈ విషయం తెలుసుకుని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు శనివారం అతని ఇంటికి వెళ్లి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. తగిన సమయం విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేతో స్థానిక నాయకులు శ్రీనివాసరావును పరామర్శించారు.

కార్యకర్తలకు ప్రమాద బీమా వరం

- టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ



ప్రమాద బీమా చెక్‌ను అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ

పెందుర్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు పార్టీ ప్రమాద బీమా వరమని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ పేర్కొన్నారు. మండలంలోని గొరపల్లి పంచాయతీ పరిధి కరకవానిపాలానికి చెందిన టీడీపీ కార్యకర్త కరక అప్పారావు ఈ మధ్యనే మరణించాడు. టీడీపీ సభ్యత్వం ఉండడంతో అతని భార్య సంధ్యకు రూ. 3.5 లక్షల ప్రమాద బీమా చెక్కును గండి బాబ్జీ శనివారం అందించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వంతో రూ.5 లక్షలు బీమాతో రాయతీలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పల్లా సింహాచలం సేవలు ఎనలేనివి

- ఎందరో ఉద్యోగులతో ఇళ్ల స్థలాలు కొనిపించిన నాయకుడు
- షిప్‌యార్డు అజాతశత్రువుగా పేరు

మల్కాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డు ఉద్యోగి, కార్మిక సంఘంనాయకుడు మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మరణ వార్తతో అప్పటి ఉద్యోగుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన షిప్‌యార్డులో పనిచేస్తూ ఉద్యోగుల సమస్యలు ముందుండి పరిష్కరించేవారు. షిప్‌యార్డులో ప్రధాన కార్యదర్శిగా పనిచేసే సమయంలో నాలుగు వందల మంది ఉద్యోగులకు మల్లయ్యస్టేడియం ఎదురుగా ఇళ్ల స్థలాలు ఇప్పించారు. ఇళ్లు కట్టుకోవడానికి ఇబ్బంది ఉన్న వారికి సీఎండీ బింద్రాతో మాట్లాడి పీఎఫ్ ఇప్పించారు. అనంతరం ఆ కాలనీకి బింద్రా అనే నామకరణ చేసింది కూడా పల్లా సింహాచలమే. షిప్‌యార్డులో తొలి సారి మెడికల్ సదుపాయం కల్పించిన ఘనత పల్లాకే సొంతం. పల్లా షిప్‌యార్డులో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. ఆయన్ను షిప్‌యార్డులో అందరూ అజాతశత్రువుగా పిలిచేవారు.

శంకర్ ఆస్పత్రిలో ఓసీటీ యంత్రం ప్రారంభం



అత్యాధునిక ఓసీటి సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న విశాఖ పోర్టు ఆథారటి డిప్యూటి చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే తదితరులు.

వేపగుంట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి రూ.25లక్షలు విలువైన అత్యాధునిక ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ(ఓసీటీ) పరికరాన్ని విశాఖ పోర్టు ట్రస్ట్ ఆథారటీ డిప్యూటి చైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అత్యాధునిక కంటివైద్యం అందిస్తున్న ఆస్పత్రి ఇదేనని కొనియాడారు. శంకర్ ఫౌండేషన్ చేస్తున్న ఉచిత కంటి సేవలకు భవిష్యత్తులో తమవంతు సహకారం అందిస్తామని అన్నారు. రెటీనా విభాగ ఇన్‌చార్జి డాక్టర్ టి.కృష్ణ మాట్లాడుతూ రెటీనాను అత్యధిక రెజ్యూలూషన్‌తో ఫోటోలు తీయడం ద్వారా గ్లాకోమా, డయోబెటిక్ రెటీనోపతి తదితర రోగాలను తొలిదశలోనే గుర్తించి చికిత్స చేసేందుకు వీలుంటుందని, అదేవిధంగా రోగికి ఎటువంటి నొప్పి లేకుండా వేగవంతంగా చికిత్స అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ జి.ఎమ్.కె.రాధాకృష్ణ, డీజీఎమ్ వి. రమేశ్ కుమార్ కె.బంగార్రాజు పాల్గొన్నారు.

అన్నీ సగం సగం పనులు



ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్డులో మరమ్మతులు సగంలోనే వదిలేసిన దృశ్యం

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డులో ఎన్ఏడీ మార్గదర్శి కార్యాలయం ముందున్న సర్వీస్‌రోడ్డులో పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. కానీ పూర్తిగా రోడ్డు పూడ్చకుండా కొమ్మలు అడ్డు పెట్టి అలానే వదిలేశారు. దీంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది ద్విచక్రవాహనాన్ని అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారుల స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేయాలని, కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'అమ్మ పేరుతో మొక్క' నిర్వహించిన బీజేపీ నేతలు



మొక్క నాటుతున్న బీజేపీ గాజువాక నియోజకవర్గం కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో శనివారం అమ్మ పేరుతో మొక్కనాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు బీజేపీ గాజువాక నియోజకవర్గం కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రాజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యానికి మనం చర్యలు తీసుకుంటే మన సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా ఉంటుందన్నారు. తల్లి పేరుతో మొక్క నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పేర్ల అప్పారావు, నాదెళ్ల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి తులసీదళార్చన



శ్రీవెంకటేశ్వర స్వామి సేవకులకు సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త మంజుల

పెదగంట్యాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 65వ వార్డు గరుడాద్రిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరుడికి శనివారం తులసీ దళార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తులసి దళాలతో పూజలు చేశారు. స్వామివారి సేవకులకు ఆలయ కమిటీ చైర్మన్‌దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్వామి వారి సేవకులు టి.రామ్మూర్తి, లీలావతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేత



మంజూరు పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ముత్యాలు

అగనంపూడి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 88వ వార్డు పరిధి చెందిన వీరప్రభ అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1,03, 404 మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాన్ని శనివారం స్థానిక కార్పొరేటర్ మొల్లి ముత్యాలు చేతుల మీదగా బాధితురాలి తల్లి లోవకుమరికి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముత్యాలు మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో బాధితురాలికి ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.సత్యనారాయణ, బండారు చందూరమేశ్, సత్యనారాయణ, ప్రభాకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో మజ్జిగ చలివేంద్రం ముగింపు

కూర్మన్నపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86వ వార్డు వుడా నగర్‌లో శనివారం మజ్జిగ చలివేంద్రం నిర్వహణ ముగింపుకార్యక్రమాన్ని శ్రీకృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ, ఒంటరి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు గంధం వెంకట్రావు, కాద శ్రీను, బొండా ఎల్లాజీరావు మాటాడుతూ మే 1న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైద్యులు నవీన్‌కుమార్ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారన్నారు. ఎండలో రాకపోకలు సాగించే ప్రజలు వీ ఎస్‌ఈజడ్ కార్మికులు, రైలు ప్రయాణీకులకు ఈ మజ్జిగ చలివేంద్రం ఎంతగానో ఉపయోగ పడిందన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు ఆర్. భీమ ప్రసాద్, డీజీఎం శ్రీనివాస్, వెంకట రమణ, నూకరాజు, గౌరీ ప్రసాద్, భాస్కర్, శ్రీదేవి, నాగేశ్వరరావు, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు(తెలుపు)20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 35 దొండకాయలు 28, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)52, బరబాటి 30,ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 44, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్ద ది) 24, బీన్స్ (పెన్సిల్) 130, కీరదోస 38, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు(కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన(కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు20, కర్ర పెండలం18, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

పొంచి ఉన్న ప్రమాదం



బెజ్జానికి ఏర్పాటు చేసిన ఎర్రటి వస్త్రం

అగనంపూడి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు శివాలయం దగ్గర నాలుగు రోడ్ల కూడలిలో ప్రమాదం పొంచి ఉంది. 20 రోజుల క్రితం కల్వర్ట్‌పైన శ్లాబుకు పెద్ద బెజ్జం పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీల వాసులు ఈ రహదారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఈ కల్వర్టు దగ్గర ప్రమాదాలకు గురవుతున్నారు. తాత్కాలికంగా ప్రమాదాలు నివారించాడానికి బెజ్జానికి ఎర్రటి వస్త్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చీరలు. దుప్పట్లు పంపిణీ

అగనంపూడి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : సంఘసేవకులు రౌతు దేముడమ్మ, దాలినాయుడు వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, కుటుంబ సభ్యులు శనివారం స్థానికంగా 300 మంది పేదలు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేముడమ్మ, దాలినాయుడు సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని బలోపేతం చేయాలి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ.అజశర్మ

విశాఖపట్నం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని బలోపేతం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ అజశర్మ ఒక ప్రకటన ద్వారా భారత రాష్ట్రపతిని కోరారు. 180 మంది విద్యార్థులున్న ట్రైబల్ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది కొరతగా ఉందని, హాస్టల్ సౌకర్యంలేక తగిన వసతులులేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ యూనివర్సిటీలో 50శాతం సీట్లు గిరిజన విద్యార్థులకు నియమాలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శాశ్విత క్యాంపస్ వేగవంతంగా నిర్మాణం కావాలని అన్ని సివిల్ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హులై అధ్యాపకకులతో అన్ని పోస్టులు భర్తీ చేయాలని, హాస్టళ్ళ, గ్రంథాలయం, ప్రయోగశాల, డిజిటల్ వనరులు కల్పించాలని కోరారు.

మొక్కలు నాటడం అలవాటుగా మారాలి



మొక్కలు నాటుతున్న ప్లాంటు డబ్ల్యూఎండీ డీజీఎం చంద్రభూషణప్రసాద్

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు అలవాటుగా మార్చుకోవాలని ప్లాంట్ డబ్ల్యూఎండీ డీజీఎం చంద్రభూషణ ప్రసాద్ అన్నారు. స్టీల్‌ప్లాంటు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ సత్యసాయి శతజయంతోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే పర్యావరణాన్ని పరిరక్షించాలని, ఇందుకు మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అధికారులు బి.బైజు, కె.రవిచంద్, భరత్‌కుమార్, బీపీ శ్రీకాంత్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ప్రాణాంతకం ట్యూమర్లు



ఉత్తరాంధ్రలో బ్రెయిన్ ట్యూమర్ కేసులు నానాటికీ అధికమవుతున్నాయి. గత పదేళ్లలో ఈ కేసులు మూడు రెట్లు పెరిగినట్టు నిపుణులు విశ్లేషిస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్లు బారినపడడానికి ప్రధానంగా జన్యుపరమైన అంశాలు, రేడియేషన్ కారణమవుతున్నట్టు చెబుతున్నారు. బ్రెయిన్ ట్యూమర్స్ అనేవి పదుల రకాల్లో ఉన్నప్పటికీ... వీటిలో కొన్ని రకాలు ప్రాణాంతకంగా మారుతున్నట్టు వైద్య నిపుణులు భావిస్తున్నారు. ఆదివారం అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

- పదేళ్లలో భారీగా నమోదవుతున్న ఈ తరహా కేసులు
- ఉత్తరాంధ్రలో ఏటా 1,500కు పైగా నమోదు
- వీటిలో ఎక్కువగా మెడిలో బ్లాస్టమో, గ్లయోమా, గ్లయోబాస్కమో..

ఉత్తరాంధ్రలో నానాటికీ అధిమవుతున్న బ్రెయిన్ ట్యూమర్ బాధితులు

- ఎంఆర్ఐ, సిటీ స్కాన్లతో సకాలంలో టూమ్యర్ల గుర్తింపునకు అవకాశం
- బయాప్సీతో క్యాన్సర్ కారక, రహిత ట్యూమర్స్‌గా నిర్ధారణ

నేడు అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్స్ డే

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

మెదడులో పాత కణజాలం పోయి కొత్త కణజాలం సృష్టి నిరంతరాయంగా జరుగుతుంటుంది. ఈ ప్రక్రియలో పాత కణజాలాలు పూర్తిగా నమసిపోకుండా మిగిలిపోతే ట్యూమర్ (కణితి)గా ఏర్పడే ప్రమాదముంది. ఈ ట్యూమర్ వల్ల ఏదైనా భాగం దెబ్బతింటే అక్కడ పనితీరు మందగిస్తుంది. బ్రెయిన్‌లో కణితి ఉంటే మాత్రం ప్రమాదకరంగా భావించాలి. కణితులు రెండు రకాలు. బ్రెయిన్‌లో మొదలై బ్రెయిన్‌లోనే వచ్చేవి ఒకటైతే, శరీరంలోని ఇతర భాగాల్లో క్యాన్సర్లు ఉండి వాటి ప్రభావం వల్ల బ్రెయిన్‌లో ఏర్పడే కణితులు రెండో రకం. బ్రెయిన్‌లో వచ్చే కణితులు మళ్లీ రెండు రకాలు. క్యాన్సర్ కారక కణితులు, క్యాన్సర్ రహిత కణితులు. బ్రెయిన్‌లో ఎటువంటి కణితి ఉన్నా ప్రమాదకరంగా భావించాలి. బ్రెయిన్ ట్యూమర్లలో వందకు పైగా రకాలున్నాయి. ఇవన్నీ రోగికి హాని కలిగించేవి. లక్ష మందిలో ఒకరు బ్రెయిన్ ట్యూమర్స్ బారినపడుతున్నారు. ప్రతి ఇద్దరు ట్యూమర్ బాధితుల్లో ఒకరు అత్యంత ప్రమాదకరమైన మెడిలో బ్లాస్టమో, గ్లయోమా/గ్లయో బ్లాస్టామో అనే క్యాన్సర్ కారక ట్యూమర్స్ బారినపడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. చిన్నారుల్లో ఎక్కువగా మెడిలో బ్లాస్టమో కనిపిస్తుండగా, పెద్దలు గ్లయోమా/గ్లయో బ్లాస్టామో బారినపడుతున్నారు.

ప్రాణాల మీదకు..

సాధారణంగా బ్రెయిన్ ట్యూమర్స్ లక్షణాలను గుర్తించలేకే అధిక శాతం మంది ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. కొన్ని లక్షణాల ద్వారా వీటిని సకాలంలో గుర్తించేందుకు అవకాశముంది. ఫిట్స్, వాంతులు, వాతం, కంటిచూపు మందగించడం, ఒకటి రెండుగా కనిపించడం, వినికిడి తగ్గడం, విపరీతమైన తలనొప్పి, బిహేవియర్‌లో తేడాలు, జ్ఞాపక శక్తిని కోల్పోవడం, మింగడంలో ఇబ్బందులు వంటి లక్షణాలను బట్టి బ్రెయిన్ ట్యూమర్స్‌గా అనుమానించాలి. శరీరంలో ఒక భాగం మొద్దుబారినట్టు ఉండడం, ముఖం కండరాలు పక్కకు లాగినట్టు ఉండడం, ఒక భాగంలో తిమ్మిర్లు, వణుకుడు లక్షణాలుంటే వైద్యులను సంప్రదించి ఎంఆర్ఐ, సీటీ స్కాన్ చేయించుకోవడం ద్వారా ట్యూమర్స్‌ను గుర్తించి, వైద్యం పొందడం ద్వారా కోలుకునేందుకు అవకాశముందని వైద్యులు పేర్కొంటున్నారు. మహిళల్లో అయితే రొమ్ముల నుంచి పాలు కారడం, పీరియడ్స్ ఆగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు.

ప్రమాదకరంగా క్యాన్సర్ కణితులు..

సాధారణ కణితులు అయితే సర్జరీ చేసి తొలగిస్తారు. క్యాన్సర్ కణితులైతే మాత్రం ఇబ్బందే. క్యాన్సర్ కణితులను నాలుగు దశలుగా పేర్కొనవచ్చు. మొదటి రెండు దశల్లో పెద్ద ఇబ్బంది ఉండదు. మూడు, నాలుగు దశల్లో ఉంటే ఆపరేషన్ అనంతరం రేడియోథెరపీ, కీమోథెరపీ చేయాలి. నాలుగో దశలో గుర్తిస్తే వారి జీవితకాలం రెండేళ్లకు మించి ఉండదు. మళ్లీ బ్రెయిన్ ట్యూమర్స్ వచ్చేందుకు అవకాశముంది. ట్యూమర్లు వయసుతో సంబంధం లేకుండా ఎవరిలోనైనా రావచ్చు. 20 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారిలో ఎక్కువగా కనిపిస్తాయి. మెడిలో బ్లాస్టమో అనే ట్యూమర్స్ మాత్రం పదేళ్ల వయసు చిన్నారులోన్యూ కనిపిస్తుంటాయి. జీన్ మ్యూటేషన్ కనిపిస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

ఏటా 1,500 కేసులు..

ఉత్తరాంధ్రలో కొన్నేళ్లుగా బ్రెయిన్ ట్యూమర్ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు. ఏటా 1,500 వరకు కేసులు కొత్తగా నమోదవుతుండగా, వీటిలో 600 క్యాన్సర్ కారక ట్యూమర్లుంటున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా శరీరంలోని ఇతర భాగాలకు వచ్చే క్యాన్సర్లు బ్రెయిన్‌కు సోకేందుకు అవకాశముంది. అయితే బ్రెయిన్ క్యాన్సర్లు మాత్రం మిగిలిన చోట్లకు పాకే అవకాశం లేదు. కణితులను బయాప్సీ ద్వారా పరీక్షించి సాధారణమైనవా?, క్యాన్సర్‌కు సంబంధించి నవా? అనేది నిర్ధారిస్తారు. క్యాన్సర్ కణితుల దశను బట్టి కీమో, రేడియోథెరపీలను అందిస్తారు. జన్యు లోపాలు, అధిక రేడియేషన్ వల్ల కొందరిలో కణితులు వస్తున్నాయి.

బ్రెయిన్ ట్యూమర్‌పై భయాలొద్దు



ప్రస్తుతం కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగానికి వస్తున్న కేసులలో 30 శాతం బ్రెయిన్ ట్యూమర్‌కి సంబంధించిన వే ఉంటున్నాయి. సంవత్సరానికి సుమారు 700 కేసుల వరకు చికిత్స అందిస్తున్నాం. చిన్నాపెద్దా తేడా లేదు. అందరికీ వస్తున్నాయి. రోగికి పగటి సమయంలో తలనొప్పి రెగ్యులర్‌గా వస్తే వైద్యుని సంప్రదించి సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌ల ద్వారా నిర్ధారణ చేసుకోవాలి. ముందుగా సమస్యను గుర్తించి తగిన చికిత్స అందిస్తే 90 శాతం రికవరీ అవుతున్నారు. అలాంటివారు సాధారణ జీవితం గడపవచ్చు. క్యాన్సర్ సంబంధిత ట్యూమర్‌లను ముందుగా గుర్తించలేక పోవటం వల్ల కేవలం 5 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. బ్రెయిన్ ట్యూమర్ చికిత్సకు కేజీహెచ్‌లో మెరుగైన వైద్యవసతులు ఉన్నాయి. అందువల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో బ్రెయిన్ ట్యూమర్‌పై ఆందోళన అవసరం లేదు. -డాక్టర్ ఎం.ప్రేమ్‌జిత్ రే, కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగాధిపతి

క్రైం... crime news

కంకరరాళ్ల కింద సమాధి అయిన కూలీ

- మూడు రోజులు ఆలస్యంగా వెలుగులోకి..



కంకరరాళ్ల కుప్ప మధ్యలో మృతుడి చెయ్యి



మృతుడు సూరన్న దొర (ఫైల్)

పెందుర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అలసిపోయి కంకరరాళ్లపై నిద్రించిన ఓ కూలీ ఆ రాళ్ల కిందనే సమాధి అయ్యాడు. మూడు రోజుల ఆలస్యంగా వెలుగు చూసిన ఈ దుర్ఘటన మండలంలోని ముదపాక జగనన్న లేఅవుట్ వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా తెర్లాం మండలం నందబలక గ్రామానికి చెందిన పక్కి సూరన్నదొర (57) కొంతకాలంగా ముదపాకలోని జగనన్న లేఅవుట్ వద్ద దినసర కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న పనులు పూర్తయ్యాక అలిసిపోవడంతో తమకు కేటాయించిన షెడ్డు వద్దకు వెళ్లకుండా సమీపంలోని కంకరరాళ్ల కుప్పపై నిద్రపోయాడు. ఆదేరోజు రాత్రి కంకరరాళ్ల (బ్లాక్ మెటల్) లోడు వచ్చింది. అక్కడ నిద్రిస్తున్న కూలీని చూడకుండా డ్రైవర్ యథావిధిగా టిప్పర్‌తో కంకరరాళ్లను డంప్ చేసి వెళ్లిపోయాడు. కంకరరాళ్ల మీద పడడంతో ఆ కుప్ప కింద ఆయన కురుకుపోయాడు. రాత్రయినా సూరన్నదొర రాకపోవడంతో సహచరులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో శనివారం కంకరరాళ్ల కుప్ప వద్ద దుర్వాసన రావడం... అక్కడకు కుక్కలు చేరడంతో కార్మికులు అనుమానంతో పరిశీలించారు. రాళ్ల కుప్ప మధ్యలో చెయ్యి కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని, క్లూస్ టీమ్‌ని రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుడు సూరన్నదొరగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాంట్రాక్టరు నిర్లక్ష్యంతోనే సూరన్నదొర మృతి చెందాడని సహచర కూలీలు ఆరోపిస్తున్నారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉండడంతో ఆయన కోసం గాలిస్తున్నామన్నారు. సూరన్నదొరకు భార్య గంగమ్మ ఉన్నారు. వీరి కుమారుడు ఏడాది కిందట జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందాడు.



మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలానికి నివాళి

మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం (86) శనివారం కన్నుమూశారు. ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే సీతంపేటలోని ఆయన నివాసానికి వచ్చి సింహాచలం భౌతికకాయాన్ని సందర్శించి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తిలతో పాటు మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, తదితరులు నివాళులర్పించారు. సింహాచలం తనయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు.

నేటి నుంచి అంధ మహిళల క్రికెట్ టోర్నీ

- నాలుగు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరు
- వేదికగా ఉక్కు స్టేడియం

విశాఖపట్నం స్పోర్ట్స్/ఉక్కుటౌన్‌షిప్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ సింహాద్రి సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ ఆంధ్రప్రదేశ్, కేరళ సంయుక్తంగా నిర్వహించనున్న అంధ మహిళల క్రికెట్ టోర్నీ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. స్టీల్‌ప్లాంట్ పరిధిలోని ఉక్కు స్టేడియం వేదికగా ఐదు రోజులు జరగనున్న ఈ టోర్నీలో ఆతిథ్య ఆంధ్ర, కేరళతోపాటు ఢిల్లీ, ఒడిశా జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. దేశంలో పురుషుల క్రికెట్‌తో పాటు మహిళల క్రికెట్ కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచ క్రికెట్ భారత మహిళల జట్టు ప్రత్యేకతను చాటుకుంటోందని, అలాగే దివ్యాంగుల క్రికెట్ కూడా స్థానిక రాష్ట్ర క్రికెట్ సంఘాలు, బీసీసీఐ ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో అంధుల మహిళల క్రికెట్‌లోనూ ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పడమే ప్రధాన ఉద్దేశంగా ఈ టోర్నీ ఏర్పాటు చేశామని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా దృష్టి లోపం ఉన్న మహిళల్లో నైపుణ్యాన్ని గుర్తించడమే కాకుండా సాధికారితకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. లీగ్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీ తొలి మ్యాచ్ ఉదయం 8 గంటలకు ఆంధ్ర-కేరళ, రెండో మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఒడిశా-ఢిల్లీ జట్లు తలపడతాయన్నారు. అలాగే సోమవారం (9న) తొలి మ్యాచ్‌లో ఆంధ్ర-ఢిల్లీ, రెండో మ్యాచ్‌లో కేరళ-ఒడిశా, మంగళవారం (10న) తొలి మ్యాచ్‌లో ఒడిశా-ఆంధ్ర, రెండో మ్యాచ్‌లో ఢిల్లీ-కేరళ, బుధవారం ఉదయం (11న) ఫైనల్స్ మ్యాచ్ జరగనుంది.

12న జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపిక పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో ఈ నెల 12న జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 2007 జులై 7కు ముందు జన్మించి, 18 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన అథ్లెట్లు ఈ నెల 14, 15 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అథ్లెటిక్స్ ట్రాక్‌లో జరిగే రాష్ట్ర స్థాయి మీట్‌లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఏడాది కూటమి పాలన భేష్

- త్వరలో దక్షిణ కోస్తా రైల్వే జీఎం బాధ్యతల స్వీకరణ
- విశ్వవిద్యాలయాల్లో బోధనా సిబ్బంది నియామకానికి ప్రభుత్వం చర్యలు
- విశాఖ ఎంపీ శ్రీభరత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అద్భుతంగా ఉందని లోక్‌సభ సభ్యుడు ఎం.శ్రీభరత్ అన్నారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరిగాయన్నారు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అన్ని విధాలుగా సాయం అందిస్తున్నదన్నారు. విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనులకు కూడా శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. దీనికి అనుగుణంగా జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్‌ను రైల్వే బోర్డు నియమించిందన్నారు. ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా విశాఖ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని శ్రీభరత్ అన్నారు. సుమారు రూ.500 కోట్లతో చేపట్టనున్న రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు 18 నుంచి 21 నెలల్లో పూర్తి కానున్నాయని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రసాదరెడ్డిపై విజిలెన్స్ విచారణ జరుగుతుందని, చట్టప్రకారంగా ప్రతి అంశంపై చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాలో అధ్యాపకుల కొరత ఉన్న మాట వాస్తవమేనని, త్వరలో బోధనా సిబ్బంది నియామకాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జీవీఎంసీ కమిషనర్ నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరామని శ్రీభరత్ తెలిపారు.

ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఎంతో పాలనాభవం ఉన్న నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయిందని, దీనిలో భాగంగా శుక్రవారం నుంచి రాతపరీక్షలు ప్రారంభమయ్యావన్నారు. త్వరలో మరికొన్ని నియామకాల కోసం నోటిఫికేషన్లు వెలువడనున్నాయని చిరంజీవిరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, సీనియర్ నేత చోడే పట్టాభి పాల్గొన్నారు.

10న ఫ్యాప్సీ పురస్కారాల ప్రదానం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు కంకటాల మల్లికార్జునరావు. పక్కన ఫ్యాప్సీ ప్రతినిధులు

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తరువాత ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) తొలిసారిగా పారిశ్రామికవేత్తలకు ప్రతిభా పురస్కారాలను అందిస్తోందని, ఈ నెల 10వ తేదీన విశాఖపట్నంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కంకటాల మల్లికార్జునరావు తెలిపారు. హోటల్ మేఘాలయలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 'ఫ్యాప్సీ ఎక్సలెన్స్-2025' పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ప్రముఖ పారిశ్రామికవేత్తలు వస్తున్నారన్నారు. మొత్తం 11 రంగాల్లో ప్రముఖులకు ఈ అవార్డులు ఇస్తున్నామని, 90 నామినేషన్లు రాగా జ్యూరీ వాటి నుంచి ఎంపిక చేసిందన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అచ్యుతరావు, ఉపాధ్యక్షులు ఎ.సత్యనారాయణ, మేనేజింగ్ కమిటీ సభ్యురాలు డాక్టర్ హేమ, మరో సభ్యులు సీహెచ్ కిశోర్‌కుమార్‌లు మాట్లాడారు. అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి స్టార్టప్‌ల వరకు అందరి నుంచి నామినేషన్లు స్వీకరించామన్నారు.

గంజాయి మూకల హల్‌చల్

- డబ్బులు కాజేసి రాళ్లతో దాడి
- పారిపోతున్న ముగ్గురు నిందితుల్లో ఒకడు కాలువలో పడిపోవడంతో పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు



కాలువలో పడి గాయపడిన గంజాయి బ్యాచ్‌కు చెందిన యువకుడు

కంచరపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పరిధిలో రాత్రింబవళ్లు గంజాయి మూకలు చెలరేగిపోతున్నాయి. కొద్దిరోజుల క్రితం కప్పరాడలో గంజాయి సేవించిన ముగ్గురు యువకులు ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన విషయం మరువకముందే శుక్రవారం కప్పరాడ, జాషువానగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో మూకలు హల్‌చల్ చేశాయి. జాషువానగర్ గుండా ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తిపై గంజాయి సేవించిన ముగ్గురు దౌర్జన్యం చేసి డబ్బులు డిమాండ్ చేశారు. అతని వద్ద డబ్బులు లేకపోవడంతో సెల్‌ఫోన్ లాక్కుని రూ.2 వేలు ఫోన్ పే చేయించుకున్నారు. తన ఫోన్ ఇవ్వమని బాధితుడు అభ్యర్థించగా అతనికి ఫోన్ ఇచ్చేసి అక్కడనుంచి అశోక్‌నగర్ వైపు వెళ్తున్న ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఇబ్బంది పెట్టారు. వెంటనే స్థానికులు గమనించి వారికి దేహశుద్ధి చేయడంతో అక్కడ నుంచి వారు ముందుకు వెళ్లిపోయారు. శనివారం తెల్లవారు జామున నాలుగున్నర గంటల సమయంలో ఇదే ప్రాంతంలో ఓ కుటుంబం ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తుండగా ముగ్గురు యువకులు డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశారు. వారిని అడ్డుకోవడంతో రాళ్లతో దాడి చేశారు. ఆ ముగ్గురిలో ఇద్దరు పారిపోగా ఒకడు సమీపంలోని కాలువలో పడిపోయాడు. కొద్దిసేపటికి అతడు కాలువలో నుంచి బయటకు వస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ యువకుడి పేరు బాలు అలియాస్ అభిషేక్‌గా గుర్తించారు. గాయాలు కావడంతో అతడిని కేజీహెచ్‌కు తరలించారు. గంజాయి మూకల ఆగడాలు హద్దుమీరుతున్నా కంచరపాలెం పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంతర్జాతీయ వాలీబాల్ టోర్నీకి నగర క్రీడాకారుడు



మౌర్య నందమూడి

విశాఖపట్నం స్పోర్ట్స్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఏషియన్ వాలీబాల్ అసోసియేషన్ (కావా) అండర్-19 పురుషుల ఇంటర్నేషనల్ వాలీబాల్ లీగ్ చాంపియన్‌షిప్-2025 టోర్నీలో పాల్గొనే భారత జట్టులో నగరానికి చెందిన యువ వాలీబాలర్ మౌర్య నందమూడికి చోటు దక్కింది. ఈ నెల 9 నుంచి ఉజ్బెకిస్తాన్‌లో జరగనున్న టోర్నీలో భారత జట్టుకు మౌర్య ప్రాతినిధ్యం వహిస్తాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో భారత వాలీబాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా చిన్నతనం నుంచి కఠోర సాధన చేశాడు. శాయ్ కోచ్‌ల శిక్షణలో నైపుణ్యాన్ని అందిపుచ్చుకుని అతి తక్కువ సమయంలో అండర్-19 భారత్ జట్టులో స్థానం పొందాడు. దాదాపు ఐదేళ్ల తర్వాత విశాఖ నుంచి అంతర్జాతీయ వాలీబాల్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న యువ వాలీబాలర్‌గా ప్రత్యేకత చాటుకున్నాడు. ప్రతిష్ఠాత్మక సెంట్రల్ ఏషియన్ వాలీబాల్ అసోసియేషన్ (కావా) పురుషుల అండర్-19 వాలీబాల్ లీగ్ టోర్నీలో పాల్గొనేందుకు ఆదివారం ఢిల్లీ నుంచి ఉజ్బెకిస్తాన్‌కు పయనమవుతున్న మౌర్యను పలువురు సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.